



	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	34.0	26.0
భద్రాద్రి	38.0	22.0



ఆట ఆగింది..

ఐపీఎల్, ఎన్నికల సీజన్‌తో వెలవెలబోతున్న సినిమా

- ఆకాశాన్నంటిన టికెట్, స్నాక్స్ ధరలు
- థియేటర్‌కు దూరమవుతున్న సామాన్యులు
- పెద్ద హీరోల సినిమాలు లేకపోవడమూ ఓ కారణం
- నేటి నుంచి థియేటర్లు తాత్కాలికంగా బంద్
- 25న పునఃప్రారంభించే అవకాశం

సినిమా.. సగటు ప్రేక్షకుడిని అలరించే మొట్టమొదటి వినోద సాధనం.. ఒకప్పుడు కిటకిటలాడే ప్రేక్షకులు.. బెనిఫిట్ షోలు, హౌస్‌ఫుల్ బోర్డులతో మహారాజయోగం అనుభవించిన సినిమా థియేటర్లు నేడు గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. నాలుగేళ్ల క్రితం కరోనా కారణంగా మూతపడిన థియేటర్లు ఆ తరువాత క్రమంగా పుంజుకుంటున్నట్టు కనిపించినా.. అనేక కారణాలతో మళ్లీ ప్రేక్షకులు థియేటర్‌కు దూరమవుతున్నారు. పెరిగిన టికెట్ ధరలు, థియేటర్లలో టికెట్ ధరలను మించిపోయిన స్నాక్స్ ధరలతో సామాన్య ప్రేక్షకులు కుటుంబంతో కలిసి సినిమాకు వెళ్లలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రస్తుతం ఐపీఎల్ సీజన్‌తోపాటు పెద్ద హీరోల సినిమాలు లేకపోవవంతో థియేటర్లకు వచ్చే ప్రేక్షకులు తగ్గిపోయారు. దాంతో కొన్నిరోజుల పాటు థియేటర్లను మూసేయాలని ఎగ్జిబిటర్ల సంఘం నిర్ణయించింది.

ఖమ్మంసాంస్కృతికం, మే 16: రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా శుక్రవారంనుంచి సినిమా థియేటర్లు మూతబడనుండటంతో ప్రేక్షకులకు సినీ వినోదం దూరం కానుంది. సింగిల్ స్ర్కీన్లలో సినిమాల ప్రదర్శనలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు రాష్ట్ర ఎగ్జిబిటర్ల సంఘం నిర్ణయం తీసుకోవటంతో మల్టీప్లెక్స్‌లు ఉండే హైదరాబాద్ తదితర పెద్ద నగరాలు మినహా మిగిలిన అన్నిచోట్లా సినిమాల ప్రదర్శన నిలిచిపోనుంది. ప్రస్తుతం ఖమ్మం నగరంలోని ఆరు సినిమా థియేటర్లు బంద్ కానుండగా, జిల్లావ్యాప్తంగా మరో 50వరకు సినిమా హాళ్లు తాత్కాలికంగా మూతపడనున్నాయి. 30వ తేదీ వరకు సినిమా హాళ్లలో ప్రదర్శనలు నిలిపివేస్తామని ఎగ్జిబిటర్ల సంఘం ప్రకటించినా.. 25న కొత్త సినిమా విడుదల ఉన్న దృష్ట్యా ఆరోజు నుంచి పునఃప్రారంభించే ఆలోచనలో జిల్లాలోని థియేటర్ల యజమానులు ఉన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఎన్నికల వాతావరణం, ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు, పెద్ద హీరోల సినిమాలు లేకపోవటం తదితర కారణాల వల్ల సినిమా హాళ్లు గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటినుంచి మొదలైన రాజకీయ వాతావరణం కారణంగా ప్రజలు ఎన్నికల ఆలోచనల్లోనే ఉంటుండటం, ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియ ముగిసినా ఫలితాల ఎదురుచూపుల్లో బిజీగా ఉండటంతో ప్రజలు సినిమా థియేటర్ల వైపు చూడడం లేదు. దీంతోపాటు ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు ప్రేక్షకవర్గాన్ని ఇళ్లల్లోని టీవీల ముందు కట్టిపడేస్తుండటం కూడా మరో ప్రధాన కారణం.. వీటితో పాటు కొత్త సినిమాలు ఓటీటీ మాధ్యమాల్లో విడుదలవుతుండటం మరింత ప్రభావాన్ని చూపుతోంది. సినిమా హాళ్లతో పోలిస్తే ప్రేక్షకులు ఓటీటీలో ఇంట్లోనే తక్కువ ధరలకు సినిమాను వీలైనప్పుడు వీక్షించే సౌలభ్యం ఉండటం వల్ల థియేటర్లకు ఆదరణ తగ్గటానికి కారణమైంది.

సినిమా హాళ్లలో టిక్కెట్ల రేట్ల పెరుగుదల, కూల్ డ్రింకులు, పాప్‌కార్న్ తదితర తినుబండారాల ధరలు మండిపోతుండడంతో కుటుంబంతో కలిసి థియేటర్లలో సినిమాను చూసే యోగం డబ్బున్నవారికే పరిమితం అవుతోంది. సాధారణ ప్రజలు క్రమంగా థియేటర్‌కు దూరమవుతున్నారు. సాధారణంగా వేసవి కాలంలో థియేటర్లు కిక్కిరిసిన ప్రేక్షకులతో హౌస్‌ఫుల్ బోర్డులను మెళ్లో వేసుకుంటాయి. కానీ ఈ ఏడాది పరిస్థితులు అన్ని విధాలా ప్రతికూలంగా మారడంతో థియేటర్ల పరిస్థితి తలకిందులైంది. పెద్ద హీరోల సినిమాలు లేకపోవటం, చిన్నా చితకా సినిమాలు ప్రేక్షకులను ఆకర్షించకపోతుండటంతో థియేటర్లు ఒక్కో షోకు రూ.5వేల నుంచి రూ.10వేల వరకు నష్టాన్ని మూటకట్టుకోవాల్సి వస్తోంది.

నష్టాల్లో థియేటర్లు..

శ్రీనివాసరెడ్డి, ఆదిత్య థియేటర్ మేనేజర్, ఖమ్మం

సినిమాహాళ్లకు ప్రేక్షకుల ఆదరణ తగ్గడంతో థియేటర్లు తీవ్ర నష్టాల్లో కూరుకుపోయాయి. ఎన్నికలు, ఐపీఎల్ సీజన్ కావడం, పెద్దహీరోల సినిమాల విడుదల లేకపోవడంతో సినిమాహాళ్లు వెలవెలపోతున్నాయి. విద్యుత్ బిల్లు, అద్దెలు, సిబ్బంది వేతనాలు వంటి ఖర్చులను కూడా భరించలేని స్థితిలో ఉన్నాం. ఈ కారణాల వల్ల కొద్ది రోజులపాటు థియేటర్లలో సినిమాల ప్రదర్శన నిలిపేయాలన్న ఎగ్జిబిటర్ల సంఘం పిలుపు మేరకు సినిమా ప్రదర్శనలు నిలిపివేయక తప్పటం లేదు.



పందెం ఎంత?

- ఏపీ ఎన్నికల ఫలితాలపై బెట్టింగ్‌ల జోరు
- ఎక్కువ మంది ఎన్డీయే కూటమివైపే ఆసక్తి
- తెలంగాణ లోక్‌సభ రిజల్ట్‌పైనా పందాలు
- ఫోన్లలోనే సాగుతున్న దందా

ఖమ్మం, మే 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రస్తుతం దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్నా అందరి దృష్టి మాత్రం ఏపీలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలపైనే ఉంది. యుద్ధాన్ని తలపించిన అక్కడి ఎన్నికల పోరులో ఎవరు విజయం సాధిస్తారనే అంశంపై ప్రస్తుతం చర్చోపచర్చలు జరుగుతున్నాయి. ఏపీకి సరిహద్దును ఉన్న ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనూ ఆ రాష్ట్రంలో ఎన్నికల ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకింది. ఎవరికి వారు ఏపీలో ఎవరు గెలుస్తారనే దానిపైనే చర్చిస్తున్నారు. ఈ క్రమంలో అక్కడి ఎన్నికల ఫలితాలపై జోరుగా బెట్టింగ్‌లు కూడా సాగుతున్నాయి. బెట్టింగ్ రాయుళ్లు "కాయ్‌రాజా కాయ్" అంటూ తమ దందాను జోరుగా సాగిస్తున్నారు. చాలావరకు బెట్టింగ్‌లు ఫోన్ల ద్వారానే సాగిస్తున్నట్లు తెలుస్తోంది. జగన్ మళ్లీ వస్తారని, కొందరు, కాదు కాదు చంద్రబాబే వస్తారని మరికొందరు బెట్టింగ్ కాస్తుండగా జనసేన అధినేత పవన్‌కళ్యాన్, టీడీపీ నేత నారా లోకేష్ విజయం, మెజారిటీలపై కూడా జోరుగా బెట్టింగ్‌లు సాగుతున్నాయి.

ఇక పార్టీల వారీగా వైసీపీ గెలుస్తుందా లేక టీడీపీ కూటమి గెలుస్తుందా అనే విషయంపై కూడా జోరుగా బెట్టింగులు సాగుతున్నాయి. అయితే ఎక్కువ మంది మాత్రం టీడీపీ కూటమి అధికారంలోకి వస్తుందని పందె కాస్తున్నట్లు సమచారం. టీడీపీ కూటమి గెలిస్తే లక్షకు రూ.80వేలు, వైసీపీ గెలిస్తే రూ.80వేలకు లక్ష ఇస్తామని బెట్టింగ్ రాయుళ్లు ఆఫర్లు ప్రకటిస్తున్నారు. గత రెండు రోజులుగా ఉమ్మడి జిల్లాలో ఈ బెట్టింగ్ వ్యవహారం జోరుగా సాగుతోంది. కొందరు ఏజెంట్లు హైదరాబాదు, విజయవాడ కేంద్రంగా ఉండి బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చేలోపు జిల్లాలో బెట్టింగ్‌ల జోరు రోజురోజుకు పెరిగే అవకాశం ఉంది. కొందరు మాత్రం అక్కడ ఎవరు గెలుస్తారనేదానిపై తమకు తెలిసిన వారితో అంచనాలు వేసుకుని బెట్టింగ్‌లకు దిగేందుకు సిద్ధమవుతున్నట్లు చర్చ జరుగుతోంది. మొత్తంమీద ఎన్నికల ఫలితాలు ప్రకటించే జూన్ 4 వరకు ఈ బెట్టింగ్ దందా రూ.కోట్లల్లోకి వెళ్లే అవకాశం కనిపిస్తోంది. ఖమ్మం, కొత్తగూడెం, సత్తుపల్లి, మధిర, భద్రాచలం, అశ్వారావుపేట సరిహద్దు నియోజకవర్గాలతో పాటు హైదరాబాదు తదితర పట్టణాల్లోనూ ఏపీ ఎన్నికలపై బెట్టింగ్‌లు జోరుగా సాగుతున్నాయి.

ఇక రాష్ట్రంలో జరిగిన లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై కూడా బెట్టింగ్‌లు సాగుతున్నాయి. కొందరు కాంగ్రెస్‌కు పది లోక్‌సభ సీట్లు వస్తాయని, కొందరు 12లోక్‌సభ సీట్లు వస్తాయని బెట్టింగ్‌లు సాగిస్తున్నారు. ఇలా కాంగ్రెస్, బీజేపీలకు వచ్చే లోక్‌సభ స్థానాలతో పాటు బీఆర్‌ఎస్‌కు ఒక్కసీటైనా వస్తుందా లేదా అనే అంశంపై కూడా పందేలు కడుతున్నట్లు చర్చ జరుగుతోంది. దీంతో ఎన్నికల ఫలితాల పుణ్యమా అని ఫోన్‌లో మాటలే పెట్టుబడిగా బెట్టింగ్ దాందా సాగుతోంది.



కూరలు కుతకుత

- రోజురోజుకూ పెరుగుతున్న కూరగాయల ధరలు
- బెంబేలెత్తుతున్నవినియోగదారులు
- వేసవి నేపథ్యంలో తగ్గిన దిగుబడి

రైతుబజార్, బహిరంగ మార్కెట్లలో ధరలు..

కూరగాయలు(కేజీ)	రైతుబజార్	ప్రైవేట్‌మార్కెట్
బీరకాయ	రూ.70	రూ.80
పచ్చిమిర్చీ	రూ.90	రూ.100
కాకరకాయ	రూ.60	రూ.80
టమాటా	రూ.30	రూ.40
వంకాయ	రూ.30	రూ.40
బెండకాయ	రూ.30	రూ.50
పొట్లకాయ	రూ.40	రూ.50
దోసకాయ	రూ50	రూ.60
గోరుచిక్కుడు	రూ.50	రూ.60
క్యాబేజీ	రూ.30	రూ.40
దొండ	రూ.40	రూ.50
సొరకాయ	రూ.20	రూ.30
క్యారెట్	రూ.50	రూ.60
క్యాప్సికం	రూ.70	రూ.80
ఆలుగడ్డ	రూ.30	రూ.40
ఉల్లిగడ్డ	రూ.20	రూ.30
కోడిగుడ్లు(30గుడ్లు)	రూ.170	రూ.180
కొత్తిమీర కట్ట	రూ.30	రూ.40

ఖమ్మం మార్కెట్, మే 16: మండుతున్న ఎండలకు తోడు కూరగాయల ధరలు కూడా వినియోగదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. సామాన్యుడి వంటగదిలో కూరలు ఉడకకుండానే కుతకుతమంటున్నాయి. నగరంలోని రైతుబజార్లు, బహిరంగ మార్కెట్‌లలో కూరగాయలను ముట్టుకుంటే మండిపోతున్నాయి. అసలే ఎండాకాలం పాఠశాలలకు, హాస్టళ్లకు వేసవి సెలవులు కావటంతో పిల్లలంతా ఇళ్లల్లోనే ఉంటారు. దీంతో గృహాలలో కూరగాయల వినియోగం ఎక్కువగా ఉంటుంది. దానికి తోడు వేసవిలో నాన్‌వెజ్ తక్కువగా, కూరగాయలను ఎక్కువగా తింటారు. ఈ క్రమంలో డిమాండ్‌కు తగిన సరఫరా లేకపోవడంతో ధరలు కొండెక్కాయి. రైతు దగ్గర పంట లేదు, ఎండాకాలం పంట పండదు. కూరగాయల వ్యాపారులు ఇదే అదునుగా కృత్రిమ కొరతను సృష్టించి ధరలు అమాంతం పెంచి వినియోగదారులను నిలువు దోపిడీ చేస్తున్నారు. టమోటా ఎప్పుడూ కేజీ రూ.15 నుంచి రూ.20లకు లభ్యమయ్యేవి. కానీ ప్రస్తుతం కేజీ రూ.30నుంచి రూ.40లకు చేరింది. మార్కెట్‌లలో టమోటానే కాకుండా ప్రతి కూరగాయ ధరలు ఆకాశాన్నంటాయి. సాధారణ రోజుల్లో కిలో రూ.20 లోపు లభించే ప్రతీ కూరగాయలు ప్రస్తుతం కిలో రూ.50 నుంచి రూ.70లకు చేరింది. ఆకుకూరలు గతంలో రూ.10లకు మూడు కట్టలు లభించేవి ఇప్పుడు రూ.20లకు 4 కట్టలు మాత్రమే లభిస్తున్నాయి. గత నెల రోజుల నుంచి నగరంలోని రైతుబజార్‌లు, బహిరంగ కూరగాయల మార్కెట్‌లలో కూరగాయల ధరలు పెరుగుతండటంతో సామాన్యుడు కూరగాయలు కొనాలంటేనే బెంబేలెత్తుతున్నాడు. ఇదిలా ఉండగా డిమాండ్‌కు సరిపడా లోకల్ కూరగాయల ఉత్పత్తి లేక ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. ఇతర రాష్ట్రాలనుంచే కాకుండా రాష్ట్రంలోని సుదూర ప్రాంతాల నుంచి కూరగాయలు దిగుమతి చేసుకోవడంతో పాటు రవాణా చార్జీల భారం సైతం ఎక్కువగా ఉండటంతో కూరగాయల ధరల పెరుగుదలకు ప్రధాన కారణమని వ్యాపారులు పేర్కొంటున్నారు.



రైతులకు నాణ్యమైన విత్తనాలు
సరఫరా చేయాలి

జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల



ఖమ్మం వ్యవసాయం, మే 16: రానున్న వానాకాలం సీజన్‌లో జిల్లాలో రైతులకు సరిపడా పత్తి, మిర్చి, మొక్కజొన్న, వరి, తదితర విత్తనాలను అందుబాటులో ఉంచాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి విజయనిర్మల తెలిపారు. ఖమ్మంలోని జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో గురువారం విత్తన కంపెనీ డీలర్లు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న వానాకాలంలో రైతులకు సరిపడా నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. విత్తనాల లాట్ నెంబర్ జీవోటీ ఆధారంగా పత్తి, మిర్చి ఇతర విత్తనాలు నాణ్యమైనవమని మాత్రమే అందుబాటులో ఉంచాలని సూచించారు. అనవసరంగా కొరత సృష్టించి రైతులను తప్పుదోవపట్టించినా, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఏడీఏలు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసరావు, విజయచందర్, నరసింహారావు, కరుణశ్రీ, ఏవోలు కిషోర్‌బాబు, చాయారాజ్, వివిధ కంపెనీల రిప్రజంటేటివ్‌లు పాల్గొన్నారు.



వికసించిన మే పుష్పం

వేసవిలో మాత్రమే వికసించే 'మే' పుష్పం చాలా అరుదుగా కనిపిస్తుంటుంది. వేసవికాలంలో చెట్లు, పువ్వులు వాడిపోతూ ఉంటాయి. కానీ ఈ పువ్వు మాత్రం వికసించి అందరికీ కనువిందు చేస్తుంది. ఒక్క మే నెలలో మాత్రమే వికసించడం వల్ల దీన్ని మే పుష్పం అంటారు. ఎర్రని బంతిలా ఆకర్షించే ఈ పుష్పం ఎండిపోయినా నేలలోని దుంప మాత్రం చనిపోదు. మళ్లీ ఏడాది మేలో పుష్పిస్తుంది. చుంచుపల్లిలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.వెంకటేశ్వరరావు నివాసంలో గురువారం ఈ పుష్పం దర్శనమిచ్చింది.

\- చుంచుపల్లి



ఏసీబీకి పట్టుబడ్డ అశ్వారావుపేట ట్రాన్స్‌కో ఏఈఈ శరత్

పైసలిస్తేనే 'పవర్'

- ఏసీబీ వలలో అశ్వారావుపేట ట్రాన్స్‌కో ఏఈఈ
- విద్యుత్‌లైన్, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు రైతునుంచి లంచం డిమాండ్
- రూ.లక్ష తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టివేత

అశ్వారావుపేట, మే 16: అశ్వారావుపేట ట్రాన్స్‌కో ఆపరేషన్స్ ఏఈఈ గురువారం ఓ రైతు నుంచి లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఖమ్మం ఏసీబీ డీఎస్పీ రమేష్, తెలిపిన ప్రకారం.. ఏపీలోని జంగారెడ్డిగూడెంలో నివాసం ఉండే కొనకళ్ల జనార్ధన్ పేరుతో అశ్వారావుపేట మండలం, మద్దికొండ వద్ద పొలం ఉంది. ఈ పొలంలో హైటెన్షన్ విద్యుత్ లైన్‌కోసం ఆయన కుమారుడు ఆదిత్య నెలరోజుల క్రితం దరఖాస్తు చేశాడు. విద్యుత్ లైన్‌కోసం రూ.1,81,000 మీ-సేవ ద్వారా చలానా చెల్లించాడు. అయినా లైన్‌తోపాటు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేందుకు చలానా సొమ్ముకాకుండా అదనంగా రూ.లక్ష లంచం చెల్లించాలంటూ అశ్వారావుపేట ఏఈఈ శరత్‌కుమార్ డిమాండ్ చేశాడు. అయితే లంచం ఇవ్వడం ఇష్టంలేని ఆదిత్య ఏసీబీ అధికారులను సంప్రదించాడు. దీంతో ఏసీబీ అధికారులు రైతు ఆదిత్యతో గురువారం సాయంత్రం రూ.లక్ష ఇవ్వడానికి ఏఈఈకి ఫోన్ చేశారు. దాంతో అతడు సొమ్ము తీసుకొని పట్టణంలోని లక్ష్మితులసి పేపర్‌బోర్డు వద్దకు రావాలని చెప్పడంతో ఆదిత్య ఏఈఈ చెప్పిన ప్రదేశానికి వెళ్లి ముందుగా ఏసీబీ అధికారులు పింక్ కెమికల్‌ను పూసి ఇచ్చిన రూ.లక్ష నగదును అతడికి అందించాడు. ఈ డబ్బు ఏఈఈ తీసుకున్న వెంటనే అతడిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్టు డీఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం కోసం డిమాండ్ చేస్తే 1064 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు. ఈ దాడుల్లో ఏసీబీ ఎస్‌ఐలు బీ సునీల్, ఎన్. శేఖర్, వై.మహేష్, హెడ్ కానిస్టేబుల్ పుల్లయ్య, కానిస్టేబుళ్ళు రంగ, శ్రీను, శ్రీనివాసాచారి బృందం పాల్గొన్నారు.

కలకలం సృష్టించిన ఏసీబీ రైడ్

విద్యుత్‌లైన్, ట్రాన్స్‌పార్మర్ ఏర్పాటుకు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన ఘటన కలకలం సృష్టించింది. ఏఈఈ శరత్‌కుమార్ రెండేళ్ల క్రితం మధిర నుంచి బదిలీపై అశ్వారావుపేటకు వచ్చాడు. అయితే అతడు మధిరలో పనిచేసే సమయంలో మీటర్ల అవకతవకలు, బిల్లింగ్‌లో తేడాలపై వివాదం ఉండటంతో ఏడాదికిపైగా సెలవుపెట్టి ఆ సమస్యను పరిష్కరించుకున్నట్టు తెలుస్తోంది. ఆ సమస్య పరిష్కారమైన తరువాత ఆరునెలల క్రితమే ఇక్కడ విధుల్లో చేరాడు. తాజాగా చలాన్ సొమ్ముతో సంబంధం లేకుండా లంచం ఇస్తేనే లైన్ వేస్తానని రైతును ఇబ్బంది పెట్టడంతో బాధిత రైతు ఏసీబీని ఆశ్రయించాడు.

ఎమ్మెల్సీ ఉపఎన్నిక ఏర్పాట్లు వేగవంతం చేయాలి

అధికారులతో ఖమ్మం కలెక్టర్ గౌతమ్ సమీక్ష



సమీక్షిస్తున్న కలెక్టర్

7

రాయలకు కన్నీటి వీడ్కోలు

- అశ్రునయనాలతో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ అంత్యక్రియలు
- పాడె మోసిన ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర



పాడె మోస్తున్న ఎంపీలు నామా, వద్దిరాజు

6

సంపులో పడి రెండేళ్ల బాలుడి మృతి

సత్తుపల్లి ద్వారకాపురి కాలనీలో ఘటన 7

ఏసీ బస్సుల్లో
ప్రయాణికులకు స్నాక్స్ బంద్



ఖమ్మం ఖానాపురంహవేలి మే 16: టీఎస్ ఆర్టీసీ ఏసీ బస్సులలో దూర ప్రాంతాలకు ప్రయాణించే ప్రయాణికులకు వాటర్ బాటిల్, స్నాక్స్ అందించేవారు. కాని ఇకనుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఏసీ బస్సులైన రాజధాని, గరుడ తదితర ఏసీ బస్సుల్లో స్నాక్స్ అందించటంలేదని టీఎస్ ఆర్టీసీ అధికారులు తెలిపారు. దూరాన్ని బట్టి టికెట్ ధరతోపాటు అదనంగా రూ:30 వసూల్ చేసి వాటర్ బాటిల్, స్నాక్స్ అందించేవారు. ఏస్సీ బస్సులలో అదనపు సిబ్బంది లేకపోవటం, ప్రయాణికులు స్నాక్స్ తిన్నతరువాత ఆ కవర్లను బస్సులోనే వేయటంతో కొందరు ప్రయాణికులు ఆర్టీసీ ఉన్నతాదికారులకు ఫిర్యాదు చేయటంతో టీఎస్ ఆర్టీసీ ఎండి ఈ నెల 15 నుంచి తెలంగాణలోని అన్ని ఏసీ బస్సులలో స్నాక్స్ అందించడం లేదన్నారు. ముందుగా రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణికులకు ఒక్కో టికెట్‌పై రూ: 30 తిరిగి చెల్లిస్తామని, ఇక నుంచి ప్రతి ఏసీ బస్సులో టికెట్ పై రూ.30 తగ్గించి తీసుకోవటం జరుగుతుందని తెలిపారు. ఖమ్మం రిజియన్ పరిధిలో మొత్తం 30ఏసీ బసులు బెంగుళూర్, హైద్రాబాద్ తదితర ప్రాంతాలకు నడుస్తున్నాయి. రోజు సుమారు 3 వేలమంది ప్రయాణికులు ఏసీ బస్సులలో ప్రయాణిస్తున్నట్లు ఖమ్మం రీజనల్ మేనేజర్ వెంకన్న తెలిపారు.

సిబ్బంది కొరత, నిల్వచేయలేక..

టీఎస్ ఆర్టీసీ బసులలో అందించే స్నాక్స్ అందించేందుకు సిబ్బంది కొరతతోపాటు ఆ స్నాక్స్ నిల్వచేయటం కొంత ఆర్టీసీ అధికారులకు ఇబ్బందిగా మారింది. కొన్ని బస్టాండ్‌లలో స్నాక్స్ నిల్వచేయటం ఇబ్బందిగా ఉండటం, సిబ్బంది సమయానికి అందుబాటులో లేకపోవటం వంటి కారణాలతో ఆర్టీసీ అధికారులు ఆ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది. ఏసీ బస్సులలో ఒకోసారి కేవలం డ్రైవర్ మాత్రమే ఉండటంతో ప్రయాణికులకు స్నాక్స్ వాటర్ బాటిల్స్ అందించటంలో ఇబ్బందులను గుర్తించిన అధికారులు ఈ పద్ధతికి స్వస్థి పలికినట్లు తెలిసింది. డ్రైవర్ ఒక్కరే ఉన్న ఏసీ బస్సులలో ప్యాణికులే వాటర్ బాటిల్, స్నాక్స్ తీసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పాడుతున్నాయి.

ప్రయాణికుల ఇబ్బందులు

ఏసీ బస్సులలో ప్రయాణించే ప్రయాణికుల లగేజ్ సర్ధటంలో ఒక్కోసారి అదనపు సిబ్బంది లేకపోవటంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పటంలేదు. ఖమ్మం నుంచి బెంగుళూర్, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు వారి లగేజ్‌ను ఎక్కేటప్పుడు వారి కుటుంబ సభ్యులు వచ్చి లగేజ్ సర్దిపెట్టేవారు. కాని దిగే సమయంలో బస్సులలో అదనపు సిబ్బంది లేకపోవటంతో లగేజ్ తీసుకొనేటప్పుడు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొందరు పెద్ద వయస్సు వారు మరీ ఇబ్బందులు పడాల్సిన పరిస్థిలి ఏర్పడుతుంది. దూర ప్రాంతాలకు వెళ్ళే బస్సులలో తప్పని సరిగా ఆర్టీసీ అదనపు సిబ్బందిని ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

యజమానుల్లో ఎల్‌ఆర్‌ఎస్ బెంగ

- డిమాండ్ నోటీసు పంపుతున్న అధికారులు
- ఉచితంగా రెగ్యులర్ చేస్తామని గతంలో కాంగ్రెస్ నాయకుల ప్రకటనలు
- రేవంత్ సర్కార్‌పై యజమానుల ఆశలు

సత్తుపల్లి, మే 16: ఎల్‌ఆర్‌ఎస్ పేరుతో దరఖాస్తు చేసుకున్న వారికి డబ్బు చెల్లించాలంటూ పలువురికి ప్రభుత్వం నుంచి అధికారులు ఎస్ఎంఎస్‌ల రూపంలో డిమాండ్ నోటీసులు పంపుతుండటంతో స్థలాల యజమానులు ఆందోళన చెందుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2020లో ఎల్‌ఆర్‌ఎస్ (లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం) ప్రవేశపెట్టింది. అనధికారిక లే అవుట్‌లో ఉన్న స్థలాలను రెగ్యులర్ చేసేందుకు ఉద్దేశించి అప్పట్లో ప్రభుత్వం ఈ ప్రక్రియ చేపట్టింది. కాని అప్పట్లో దీనిపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేక వ్యక్తం అయింది. దీంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. కాని ప్రస్తుతం అధికారులు ఎల్‌ఆర్‌ఎస్ పథకం క్రింద డబ్బు చెల్లించాలంటూ డిమాండ్‌తో కూడిన ఎస్ఎంఎస్‌లు పంపటంతో సామాన్య, మధ్యతరగతికి చెందిన వారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

గతంలో ఇలా..

అనధికారిక లే అవుట్లకు సంబంధించి ప్లాట్లు రెగ్యులర్ చేయించుకోవాలని, అందుకు వీలుగా దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం స్థలాల యజమానులకు సూచించింది. అనధికారిక లే అవుట్‌లు వేసిన రియల్టర్లకు ఇది వరంగా మారింది. కాని సామాన్య, మధ్యతరగతి యజమానులకు మాత్రం ఇబ్బందిగా మారింది. అక్రమ లే అవుట్ల క్రమద్ధీకరణ కోసం అని అప్పట్లో ప్రభుత్వం ప్రకటించినా మునిసిపాలిటీలు, గ్రామాల్లో మాత్రం అధికారులు ఇళ్ల మధ్య దశాబ్దాల క్రితం కొనుగోలు చేసిన ఇళ్ల ప్లాట్లకు కూడా ఎల్‌ఆర్‌ఎస్ వర్తిస్తుందని అధికారులు ప్రకటించటంతో పాటు అప్పట్లో ఎల్‌ఆర్‌ఎస్ లేని ప్లాట్ల క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లు కూడా నిలిపివేయటంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో స్థలాల యజమానులు వేల సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు సమయంలో రూ.వెయ్యి చెల్లించారు. విశ్రాంత ఉద్యోగులు, సామాన్య, మధ్యతరగతి తరగతి ప్రజలు పలువురు ఇళ్ల స్థలాలు దశాబ్దాల క్రితం కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. కాని వాటికి కూడా లే అవుట్ క్రమబద్ధీకరణ చేయాలని ఆదేశించటంతో పలువురు అప్పట్లో అసంతృప్తి వ్యక్తం చేశారు. దశాబ్దాల క్రితం స్థలాల ధరలు తక్కువగా ఉండేవని, అప్పట్లో తాము కొనుగోలు చేసిన ధరతో సమానంగా ప్రభుత్వం నిర్ణయించిన ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సత్తుపల్లి మునిసిపల్ కార్యాలయం

ఎల్‌ఆర్‌ఎస్‌పై కాంగ్రెస్ అసంతృప్తి

ఎల్‌ఆర్‌ఎస్‌ను బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టడంతో పాటు రిజిస్ట్రేషన్లు కూడా నిలిపివేయటంతో 2020-21లో అప్పటి విపక్ష పార్టీ అయిన కాంగ్రెస్ నాయకులు తీవ్ర అసంతృప్తి, నిరసన వ్యక్తం చేశారు. ఎల్‌ఆర్‌ఎస్ రద్దు చేయాలని అప్పట్లో కాంగ్రెస్ అగ్రనాయకులు డిమాండ్ చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఎల్‌ఆర్‌ఎస్ రద్దు చేసి ఉచితంగా లే అవుట్ల క్రమబద్ధీకరణ చేస్తామని ప్రకటించారు. స్థలాల యజమానులు, విపక్షాల విమర్శల నేపథ్యంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ నుంచి వెనక్కి తగ్గింది. గత అసెంబ్లీ ఎన్నికలు ముగిసే వరకూ దీనిపై బీఆర్‌ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదు.

డిమాండ్ నోటీసులు పంపుతున్న అధికారులు

ఎల్‌ఆర్‌ఎస్ కింద దరఖాస్తు చేసుకున్న వారికి గతంలో కొందరికి డిమాండ్ నోటీసులు రాగా వీరిలో కొందరు చెల్లించారు. మరి కొందరు చెల్లించలేదు. సత్తుపల్లి మునిసిపాలిటీ పరిధిలో మొత్తం 3400 దరఖాస్తులు ప్రభుత్వానికి అందాయి. వీటిలో అధికారులు తిరస్కరించి నవి పోగా 1800 దరఖాస్తులు అర్హత ఉన్నాయని తేల్చారు. వీటిలో 900 దరఖాస్తులకు మునిసిపల్ కమిషనర్ అప్రూవల్ ఇచ్చారు. సత్తుపల్లి మునిసిపాలిటీ పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్ కింద స్థలాల యజమానులు రూ.21లక్షలు గతంలోనే చెల్లించారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో కూడా కోడ్ అమల్లో ఉన్నప్పటికీ గత నెలలో కూడా డిమాండ్ నోటీసులు అందాయి. రూ.వేలల్లో డిమాండ్ రావటంతో సామాన్య, మధ్యతరగతికి చెందిన స్థలాల యజమానులు ఆవేదన చెందుతున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆశలు

గతంలో విపక్ష పార్టీగా ఎల్‌ఆర్‌ఎస్ రద్దు చేయాలని, ఉచితంగా క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేసి కాంగ్రెస్ ప్రస్తుతం అధికారంలో ఉండటంతో స్థలాల యజమానులు ప్రస్తుత ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎల్‌ఆర్‌ఎస్ ఉచితంగా చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ నాయకులు ప్రస్తుతం వారి హామీని నిలబెట్టుకోవాలని కోరుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఏమి నిర్ణయం తీసుకుంటుందోనని పలువురు స్థలాల యజమానులు ఎదురు చూస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం నుంచి ఏ రకమైన ఆదేశాలు లేని కారణంగా గత ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నోటీసులు పంపుతున్నామని ఒక అధికారి తెలిపారు. నిబంధన ప్రకారం నోటుసు ప్రకారం డబ్బులు చెల్లించకపోతే పెనాల్టీ కూడా విధించే అవకాశం ఉందని చెపుతున్నారు. మొత్తంగా ప్రస్తుతం ప్రభుత్వం నుంచి ఎస్ఎంఎస్ రూపంలో స్థలాల యజమానులకు వస్తున్న డిమాండ్ నోటీసులతో సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది.

వైరాలో కొరవడిన ఓటర్ల చైతన్యం

● పట్టణంలో తగ్గిన ఓటింగ్ శాతం

వైరా, మే 16: వైరా మునిసిపాలిటీలోని ఓటర్లలో చైతన్యం కొరవడిందనే విమర్శలు విన్పిస్తున్నా యి. మరీ ముఖ్యంగా వైరా పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లోని ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటుహక్కు వినియోగించుకోలేదనే విమర్శలు విన్పిస్తోన్నాయి. అయితే ఈ ప్రాంతాల్లోని ఓటర్లు దేశ, విదేశాల్లోని దూర ప్రాంతాల్లో ఉద్యోగ, ఉపాధి నిమిత్తం వెళ్లి ఉన్నందున ఎంపీ ఎన్నికలపై అంతగా ఆసక్తి చూపకపోవడంతో ఓటింగ్ సరళి తక్కువగా ఉందనే వాదన కూడా విన్పిస్తోంది. ముఖ్యంగా వైరాలో 199, 198పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఓటింగ్‌శాతం బాగా తగ్గిపోయింది. నియోజకవర్గంలోని 252 పోలింగ్ బూత్‌ల్లో వైరాలోని 199 పోలింగ్ బూత్‌లో అతి తక్కువగా 47.66శాతం ఓటింగ్ మాత్రమే నమోదైంది. ఈ పోలింగ్ బూత్‌లో 726మంది ఓటర్లకుగానూ 346మంది మాత్రమే ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఆతర్వాత 198పోలింగ్ బూత్‌లో 55.17శాతం ఓటింగ్ మాత్రమే నమోదైంది. 948మంది ఓటర్లకుగానూ 523మంది ఓటర్లు మాత్రమే ఓటుహక్కు వినియోగించుకున్నారు. 200పోలింగ్ బూత్‌లో 734మందికిగానూ 406మంది మాత్రమే ఓటు వేయడంతో 55.31శాతం ఓటింగ్ నమోదైంది. 201 పోలింగ్ బూత్‌లో 749మందికిగానూ 422మంది మాత్రమే ఓటు వేయడంతో 56.34శాతం మాత్రమే ఓటింగ్ నమోదైంది. 202 బూత్‌లో 68.48శాతం, 203బూత్‌లో 63.56శాతం, 204లో 69.57శాతం, 205లో 71.30శాతం, 206లో 79.20శాతం, 207లో 68.50శాతం, 208లో 68.66శాతం, 209లో 78.84శాతం, 210లో 71.71శాతం, 211లో 68.50శాతం, 212లో 70.30శాతం, 213లో 60.74శాతం మాత్రమే ఓటింగ్ నమోదైంది. ఇకపోతే గిరిజన ప్రాంతమైన వైరా నియోజకవర్గంలోని జూలూరుపాడు మండలంలో ఉన్న నల్లబోడు పోలింగ్ బూతు 90లో అత్యధికంగా 95.97శాతం ఓటింగ్ నమోదైంది. ఇక్కడ 149మంది ఓటర్లకుగానూ 143మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఆతర్వాత పోలింగ్ అత్యధికంగా నమోదైన పోలింగ్ బూతు కొణిజర్ల మండలంలోని మేకాలకుంట 144లో 94.25శాతం పోలింగ్ నమోదైంది. ఇక్కడ 574మందికిగానూ 541మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు.

వైభవంగా పెద్దమ్మతల్లి జాతర



బోనాలతో ఆదివాసీ మహిళలు

జూలూరుపాడు, మే 16 : మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో గురువారం పెద్దమ్మతల్లి జాతర కార్యక్రమాన్ని ఆదివాసీలు వైభవంగా నిర్వహించారు. గ్రామంలో అమ్మవారిని ఊరేగించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివాసీ మహిళలు బోనాలతో ప్రదర్శనగా ఆలయం వద్దకు చేరుకుని అమ్మవారికి బోనాలను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. సాంప్రదాయ నృత్యాలు చేసి అలరించారు. జాతరను పురష్కరించుకుని గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి ఈసం సాములు, ఆలయకమిటీ సభ్యులు తాటి అప్పారావు, ముక్తి గాంధీ, గుర్రం మల్లయ్య, రాములు, భూషయ్య, కొడెం సీతాకుమారి, ముక్తి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం రాష్ట్ర యూత్ కార్యదర్శిగా రవి

ఖమ్మంచర్చికాంపౌండ్, మే 16: మున్నూరుకాపు సంఘం తెలంగాణ రాష్ట్ర యూత్ కమిటీ కార్యదర్శిగా ఖమ్మం నగరానికి చెందిన మాటేటి రవి నియమితులయ్యారు. ఈమేరకు గురువారం ఆసంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య పటేల్ నియామకపత్రం అందించారు. మాటేటి రవి నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. రవి మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల గాంధీ, రాష్ట్ర కార్యదర్శి శెట్టి రంగారావు, కనుశెట్టి నరసయ్య, శెట్టి భాస్కర్, అనిరుద్, ఉప్పలయ్య పాల్గొన్నారు.

ఖమ్మంలో బీజేపీ విజయం ఖాయం

- ఆత్మీయ సమ్మేళనంలో తాండ్ర వినోద్‌రావు
- ఇక 'స్థానిక' ఎన్నికలపై దృష్టి

ఖమ్మంబైపాస్‌రోడ్, మే16: జరిగిన లోక్‌సభ ఎన్నికలలో బీజేపీ విజయం ఖాయం అని, ఇకపై స్థానిక సంస్థల ఎన్నికల పైనే మా దృష్టి అని బీజేపీ ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోదరావు తెలిపారు. ఖమ్మం నగరంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో గురువారం కార్యకర్తల, మీడియా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వినోదరావు మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి తనతో పాటు సహకరించేందుకు మీడియా మిత్రులు ముందుకు వచ్చి సహకరించారని, జరిగిన యుద్ధంలో బీజేపీ విజయం సాధించబోతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట నిలబెట్టుకుంటామని, ఇకపై జిల్లాలోనే ఉండి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. తన వ్యాపారాలకు సైతం ఖమ్మంలోనే కార్యాలయాలు ఏర్పాటు చేసి ఇక్కడి నుండే వ్యాపారాలు చేస్తానని తెలిపారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా బీజేపీ విజయం సాధించబోతుందని, జరిగే ఎన్నికల్లో ఇకపై ముందుండి ప్రచారం చేసి వారి గెలుపుకు కృషిచేస్తానన్నారు. అదేవిధంగా జరగబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో ఈటెల రాజేందర్, రాష్ట్ర నాయకత్వం ప్రచారం చేసేందుకు ఖమ్మం కు రానున్నారని, ఈ ఎన్నికలలో బీజేపీ అభ్యర్థి గెలుపు కార్యకర్తలు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రదానమంత్రి కార్యాలయం నుంచి ఫోన్ వచ్చిందని, కేంద్ర బృందం అంతా పరిశీలిస్తున్నారని, ఇంటిలిజెన్సి రిపోర్టులు సైతం బీజేపీ 20వేల ఓట్ల మెజారిటీతో గెలవబోతుందని చెబుతున్నారని తెలిపారు. జిల్లాలో ముగ్గురు మంత్రులుండి ఎన్నో రకాలుగా ఇబ్బందులకు గురిచేశారని, డబ్బులకు ప్రజలను ప్రలోబపెట్టారని, అయినా కూడా ప్రజలు తనవెంటే ఉండి ఓట్లు వేశారన్నారు. అనంతరం ఎంఆర్‌పీ ఎస్ జిల్లా అధ్యక్షుడు సునిల్‌మాదిగ మాట్లాడుతూ జూన్ 4న మాదిగల ఓటింగ్ బీజేపీకి ఎలా ఉందో ప్రజలు చూస్తారన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీని వాస్ మాట్లాడుతూ బీజేపీ అభ్యర్థిగా వినోదరావు పేరు ఖరా రుకాకముందే మారుమూల ప్రాంతాల్లో సైతం తాండ్ర వినోదరావు పేరు వెళ్లిందని, ఆయన చేసిన అభివృద్ధి కార్యక్ర మాలు కూడా ప్రజల్లోకి వెళ్లాయన్నారు. రాష్ట్రం మొత్తం ఇకపై బీజేపీ ప్రభంజనం సృష్టించబోతుందని, నా విజయంతోనే బీజేపీ విజయం సైతం మొదలయిందన్నారు. ఈకార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయ ణ, టీడీపీ నాయకులు కేతినేని హరీష్, బీజేపీ జిల్లాప్రదాన కార్యదర్శి శ్యామ్‌రాథోడ్, డాక్టర్ శీలం పాపారావు, వీరపల్లి రాజేష్, అల్లిక అంజయ్య, దుద్దుకూరి వెంకటేశ్వరరావు, కార్పొరేటర్ డి.సత్యనారాయణ, విజయారెడ్డి, మంద సరస్వతి, శ్యామ్, ఎంఆర్‌పీఎస్ నాయకులు క్రాంతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వినోద్‌రావు

ఆర్‌సీహెచ్‌పీ వద్దు..

- ప్లీజ్ అంకుల్.. ప్లీజ్ అంటూ... ప్లకార్డులతో చిన్నారుల నిరసన
- సత్తుపల్లిలోని జీఎం కార్యాలయం ఎదుట ధర్నా

సత్తుపల్లిరూరల్, మే 16: సత్తుపల్లిలోని జేవీఆర్, కిష్టారం ఓసీల నుంచి బొగ్గును తరలించేందుకు ఏర్పాటుచేసిన ఆర్‌సీహెచ్‌పీ (రుద్రపూర్ కోల్ హ్యాడ్లింగ్ ప్లాంట్) వద్దంటూ సత్తుపల్లి, కిష్టారం పరిసర ప్రాంత చిన్నారులు ప్లీజ్ అంకుల్.. ప్లీజ్ అంటూ.. ప్లకార్డులతో గురువారం ఆందోళన చేశారు. సత్తుపల్లిలోని దీ లారీ, టిప్పర్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లారీ యజమానులు, డ్రైవర్ల పిల్లలు పట్టణ శివారులోని వెంగళరావునగర్‌లోని కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయం ఎదుట చిన్నారులు ర్యాలీగా వెళ్లి ఆందోళన చేపట్టారు. 2005నుంచి నేటివరకు సింగరేణిపై ఆధారపడి జీవిస్తున్న తమ కుటుంబాలకు భవిష్యత్ లేకుండా చేయొద్దంటూ చిన్నారులు వేడుకున్నారు. రుద్రంపూర్ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్‌కు బొగ్గును రోడ్డు ద్వారా బొగ్గు రవాణా చేసినట్లయితే గతంలో వలే ప్రమాదాలు చోటుచేసుకుని చాలా కుటుంబాలు రోడ్డున పడతాయని, అదేవిధంగా బొగ్గు లోడింగ్ తమకు ఇవ్వకపోవడంతో మా పరిస్థితి అదేనని ఆందోళన వ్యక్తం చేశారు. ఉత్పత్తిలో 40శాతం బొగ్గును లోడింగ్‌కు ఇవ్వాలని, అందులోనూ నాణ్యమైనది మాత్రమే తమకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆర్‌సీహెచ్‌పీని ఆపివేయడంతో పాటు మా లారీలకు లోడింగ్‌కు అవకాశం కల్పించాలని, మా విద్య, ఆరోగ్యం, మంచి భవిష్యత్తుకు సింగరేణి సంస్థ పూర్తిగా సహకరించాలని చిన్నారులు వేడుకున్నారు. తమకు జీవనాధారమైన నల్లబంగారమైన బొగ్గును రవాణా కల్పించాలని, లేనట్లయితే వచ్చేనెలలో పాఠశా లలు ప్రారంభమవుతున్న దృష్ట్యా పుస్తకాలు, బ్యాగులు, యూనిఫామ్, ఫీజులు చెల్లించేందుకు తమ తాతలు, తండ్రుల వద్ద పైసా కూడా లేదని, సింగరేణి సంస్థ పెద్ద మనసు చేసుకుని మా భవిష్యత్తుకు తమవంతుగా సహకారం అందించాలని చిన్నారులు కోరారు. అనంతరం చిన్నారులు, లారీ అసోసియేషన్ బాధ్యులతో కొత్తగూడెం ఏరియా జీఎం షాలెంరాజు మాట్లాడుతూ ఆర్‌సీహెచ్‌పీకి ఇవ్వకుండా స్థానికులకు మాత్రమే ఇస్తామని, నాణ్యమైన బొగ్గును కూడా లోడింగ్‌కు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అయితే ఆర్‌సీహెచ్‌పీని పూర్తిగా ఆపాలని, తమకు 40శాతం బొగ్గు లోడింగ్ ఇవ్వాలని డిమాండ్ చేయగా రాత్రి పొద్దుపోయే వరకు ఆందోళన కొనసాగింది.



జీఎం కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న చిన్నారులు

రైల్వే స్థలాల కబ్జా..

- యథేచ్ఛగా ఆక్రమణలు
- పట్టించుకోని అధికారులు



రైల్వేలైన్ స్థలంలో వెలిసిన అక్రమ నిర్మాణాలు

ఇల్లెందుటౌన్, మే 16: రైల్వేస్థలాలు అక్రమణలు జోరుగు సాగుతున్నాయి. అధికారులంతా పార్లమెంట్ ఎన్నికల పనుల్లో నిమగ్నం కావ డంతో ఇదే అదునుగా భావించిన కొంతమంది అక్రమ దారులు రైల్వేస్థలాల్లో నిర్మాణాలు కొనసాగించి అక్రమాలకు పాల్పడ్డారు. ఇల్లెందు పట్టణంలో రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న రైల్వేస్థలాల కొంతమంది కన్నువేసి అక్రమ రవాణాలు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. 2006వరకు ఇల్లెందు ప్యాసింజర్ రైలు రాగా అనంతరం ప్యాసింజర్ రైలు రద్దు కావడంతో రైల్వేస్టేషన్‌తోపాటు రైల్వేక్వార్టర్లు నిరుపయోగంగా మారాయి. దీంతో 15 సంవత్సరాలుగా రైల్వేస్థలాలు అన్యాక్రాంతమయ్యా. రైల్వే ఆస్తుల రక్షణ కోసం రైల్వే అధికారులు, స్థానిక అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో అక్రమణలు సాగుతునే ఉన్నాయి. పది రోజులుగా రైల్వేస్థలాల్లో సమీప ప్రాంతాలకు చెందిన కొంతమంది ప్రముఖ అండతో ఇళ్ల నిర్మాణాలు చేశారు. రైల్వేబ్రిడ్జి ప్రాంతంతో పాటు తహసీల్దార్ కార్యాలయ సమీపం ప్రాంతంలో రాత్రికిరాత్రే అక్రమ నిర్మాణాలు చేశారు. రైల్వే అధికారులు స్థానికంగా ఉండని కారణంతో యథేచ్ఛగా ఈ నిర్మాణాలను చేపడుతున్నారు. స్థానిక మున్సిపల్, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శిలు వెల్లువెత్తుతున్నాయి. నిరుపేదలు కాకుండ ఇళ్ల స్థలాలు లేనివారు కూడా పెద్ద పెద్ద భవనాలు ఉన్న వారే రైల్వేస్థలాలను అక్రమించి నిర్మాణాలు చేపట్టడం గమనార్హం. గత పది రోజుల కాలంలో రైల్వేస్థలాలను ఎవరికి వారే హద్దులు నిర్ణయించుకుని కొంతమంది షెడ్లు నిర్మించగా మరికొంతమంది పాతచీరెలు, గోనెపట్టాలు చుట్టు ఈ స్థలం మాదంటూ హద్దులు పాతారు. వీరందరికి కొంతమంది చోటామోటా నేతల అండదండలు ఉన్నట్లుగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొంతమంది వ్యక్తులు అక్రమణదారులతో కుమ్మక్కై మీకు అండగా ఉంటూ న్యాయం చేస్తామంటూ దండుకుంటున్నారే విమర్శలు సైతం వస్తుండటం గమనార్హం.

అక్రమణలు తొలగిస్తాం

దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్

రైల్వేస్థలాల్లో చేపడుతున్న అక్రమ రవాణాలను అడ్డుకుని తొలగిస్తాం. మున్సిపాలిటి అనుమతులు లేకుండ రైల్వేస్థలాల్లో నిర్మాణాలు చేపట్టడం నేరం. ఇప్పటికే పనులను అడ్డుకున్నాం. పూర్తిస్థాయిలో అక్రమణలు తొలగిస్తాం.

ముందుచూపు..!

- ఆశ్రమాల్లో మౌలిక సమస్యలకు పరిష్కారం
- విద్యార్థుల కోసం 3,552 ఫ్యాన్ల కొనుగోలు
- పరిశీలన, పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలు
- ఐటీడీఏ చరిత్రలో ఇదే తొలిసారి శ్రీకారం చుట్టిన పీవో ప్రతీక్‌జైన్
- రాష్ట్రంలోని ఐటీడీఏలకు మార్గదర్శిగా భద్రాచలం

భద్రాచలం, మే 16: సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) భద్రాచలం పరిధిలోని విద్యా సంస్థల్లో మౌలిక సమస్యల పరిష్కారంలో సరి కొత్త కార్యక్రమానికి భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ శ్రీకారం చుట్టారు. ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో ఉన్న సమస్యలను విద్యా సంవత్సరం ఆరంభానికి ముందే గుర్తించి వాటిని సత్వరమే పరిష్కరించేందుకు పీవో చర్యలు చేపట్టారు. వెలుతురు, గాలి లేకపోవడం, స్నానపు గదులు, మరుగుదొడ్లలో పరిశుభ్రత లోపించడం, తరగతి గదుల్లో పగిలిన ప్లోరింగ్, గోడలు, పని చేయని ఫ్యాన్లు, స్విచ్‌బోర్డుల వద్ద సమస్యలు, పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడం ఇలా వివిధ రకాల సమస్యలను గుర్తించి వాటికి నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

అంతే కాదు అవసరమైన సామగ్రి సత్వరమే కొనుగోలు చేసుకునేందుకు సంబంధిత పాఠశాలల హెచ్‌ఎంలకు వెసులుబాటు కల్పించారు. ఇదే సమయంలో కీలకమైన ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు లాంటివి పీవో పర్యవేక్షణలోనే కొనుగోలు చేసి అవసరమైన విద్యా సంస్థలకు వాటిని పంపుతున్నారు. ఈ విధంగా చేపడుతున్న పనులు నూతన విద్యా సంవత్సరం ఆరంభం నాటికి ఎట్టి పరిస్థితుల్లో పూర్తికావాలని సంబంధిత అధికారులకు పీవో ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో ఐటీడీఏ పీవో ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలను సందర్శించి అవసరమైన వాటికి మరమ్మతు చర్యలు చేపడుతున్నారు.

తొలిసారిగా ముందడుగు

భద్రాచలం ఐటీడీఏ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా విద్యా సంవత్స రం ఆరంభానికి ముందే తొలిసారిగా విద్యా సంస్థల్లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు పీవో స్థాయి అధికారి చొరవ చూపడం ఇదే తొలిసారి. ఐటీడీఏ పరిధిలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 50 ఆశ్రమ పాఠశాలలు, 13 వసతి గృహాలు, ఖమ్మం జిల్లా పరిధిలో 10 ఆశ్రమ పాఠశాలలు, ఎనిమిది వసతి గృహాలు ఉన్నాయి. ఇందులో ఉన్న సమస్యలను గుర్తించేందుకు ఇప్పటికే 24 మంది ప్రత్యేక అధికారులకు 59 విద్యా సంస్థలకు దత్తత బాధ్యతలప్పగించారు. వీరు ఇటీవల పదో తరగతి పరీక్షల సమయంలో సంబంధిత పాఠశాలలకు దత్తత అధికారులుగా వ్యవహరించారు. ఈ ప్రత్యేక అధికారులు, ఐటీడీఏ ఇంజనీరింగు విభాగం అధికారులు ప్రధానోపాధ్యాయులు, ఏటీడీవోలతో బృందాలను ఏర్పాటు చేశారు. క్షేత్రస్థాయిలో విద్యా సంస్థలను సందర్శించి పరిశీలించి సత్వరం చేపట్టాల్సిన సమస్యలను గుర్తిస్తున్నారు. ఈ క్రమంలో ప్రధానోపాధ్యాయుని స్థాయిలో పరిష్కరించే సమస్యలకు ఆయనకే ఆర్థికపరంగా వనరులు వినియోగించుకునేందుకు వెసులు బాటు కల్పించినట్లు తెలిసింది.

బంకర్ల స్థానంలో మంచాలు

ఐటీడీఏ విద్యా సంస్థల్లో గతంలో విద్యార్థుల కోసం బంకర్లను ఏర్పాటు చేశారు. అయితే బంకర్లపైన నిద్రించే విద్యార్థులకు ఫ్యాను గాలి తగులుతుండగా మధ్యలో కింద ఉన్న వారికి గాలి రాకపోవడంతో అందుకు ప్రత్యామ్నాయ చర్యలను చేపట్టారు. ఈ క్రమంలో బంకర్లను కట్ చేసి మంచాలుగా ఏర్పాటు చేస్తున్నారు. అలాగే నీటి సరఫరా అన్ని చోట్ల సవ్యంగా జరిగేలా అవసరమైన చోట నూతన పైపులైన్లు ఏర్పాటు చేయడం, చేతులు కడిగే చోట గన్‌మెటల్ ట్యాప్‌లను ఏర్పాటు చేస్తున్నారు. అదేవిధంగా తరగతి గదులు, విద్యా సంస్థల ప్రాంగణాల గోడలు, ప్లోరింగ్ పగిలినా, బీటలు వారినా వాటి ప్యాచ్ వర్కులు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా పాఠశాలలు, వసతి గృహాల్లో స్విచ్ బోర్డుల వద్ద తరచూ ఎదురవుతున్న సమస్యలను గుర్తించి అవసరమైతే నూతన స్విచ్ బోర్డులను ఏర్పాటు చేస్తున్నారు. మరుగుదొడ్లు, స్నానపు గదులు పరిశుభ్రంగా ఉండేలా చూడటంతో పాటు తరగతి గదులు, వసతి గదుల్లో వెలుతురు, గాలి మంచిగా వచ్చేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. అదే విధంగా విద్యా సంస్థల్లో తలుపులు, కిటికీలు, ఇతరత్రా సమస్యలను పరిష్కరించాలని పీవో ఇప్పటికే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. విద్యా సంస్థల్లో 3,552 ఫ్యాన్లు ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే నాణ్యత గల కంపెనీ ఫ్యాన్లను కొనుగోలు చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. అలాగే 4,530 ట్యూబ్‌లైట్లను సైతం కొనుగోలు చేశారు. వీటిని అవసరమైన పాఠశాలలకు తరలిస్తున్నారు.

ఇదిలా ఉండగా ఏదైనా మరమ్మతు పనులను గుర్తించకపోతే సంబంధిత ప్రత్యేక అధికారి, ప్రధానోపాధ్యాయులే బాధ్యులవుతారని సమాచారం.



కిన్నెరసాని స్పోర్ట్స్ స్కూల్‌లో బంకర్లను కట్ చేసి మంచాలుగా ఏర్పాటు

రాష్ట్రంలోని ఐటీడీఏలకు ఆదర్శం భద్రాద్రి

రాష్ట్రంలోనే తొలిసారిగా భద్రాచలం ఐటీడీఏలో ముందస్తుగా చేపట్టిన వసతి గృహాల సమస్యల పరిష్కారం ప్రయోగం సత్ఫలితాలు ఇచ్చే దిశగా సాగుతోంది. ఇందులో భాగంగా ఇప్పటికే పీవో ప్రతీక్‌జైన్ విద్యా సంస్థలను సందర్శించి సమస్యలను స్వయంగా తెలుసుకొని వాటికి పరిష్కారం చూపేందుకు చర్యలు చేపడుతున్నారు. ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ ముందుచూపుతో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని రాష్ట్రస్థాయిలోని అన్ని ఐటీడీఏల్లో అమలు చేసేందుకు గిరిజన సంక్షేమ శాఖ రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.

'రాయల'కు కన్నీటి వీడ్కోలు



నివాళులర్పిస్తున్న సీపీఐ జాతీయ నాయకుడు పువ్వాడ నాగేశ్వరరావు

తల్లాడ, మే 16: తల్లాడ మండలం మిట్టపల్లి గ్రామంలో గురువారం వేలాదిమంది అభిమానుల అశ్రునయనాల మధ్య డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రాయల వెంకటశేషగిరిరావు అంత్యక్రియలు ముగిశాయి. అంతిమ యాత్రలో ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర పార్థీవదేహన్ని మోశారు. శేషగిరిరావు పార్థివ దేహన్ని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, మాజీ ఎమ్మెల్యేలు పువ్వాడ నాగేశ్వరరావు, కొండబాల కోటేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఆంధ్రజ్యోతి ఖమ్మం యూనిట్ మేనేజర్ తాళ్లూరి పుల్లారావు, బ్యూరో ఎన్.వెంకట్రావ్, ఏసీపీ ఎస్.వెంకటేష్, డీసీసీబీ డైరెక్టర్లు అయిలూరి వెంకటేశ్వర్‌రెడ్డి, బోబోలు లక్ష్మణ్‌రావు, కాంగ్రెస్ జిల్లా నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, జక్కంపూడి కృష్ణమూర్తి, బొర్రా రాజశేఖర్, చావా నారాయణరావు, కొత్తూరి ప్రభాకర్‌రావు, పసుమర్తి చంద్రరావు, దీవెల కృష్ణయ్య, కాపా సుధాకర్, రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కేతినేని హరీష్, ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, జడ్పీటీసీ దిరిశాల ప్రమీల, మాజీ జడ్పీటీసీ తాతా భాస్కర్‌రావు, సొసైటీ చైర్మన్లు అయిలూరి ప్రదీప్‌రెడ్డి, తూము వీరభద్రరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, పాలెపు రామారావు, దుగ్గిదేవర వెంకట్‌లాల్, బీజేపీ మండల అధ్యక్షుడు ఆపతి వెంకటరామారావు, పలువురు ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, ప్రభుత్వ అధికారులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించారు.

కుటుంబసభ్యులను పరామర్శించిన తాండ్ర

రాయల వెంకటశేషగిరిరావు కుటుంబసభ్యులను గురువారం బీజేపీ రాష్ట్ర నాయకుడు తాండ్ర వినోదరావు పరామర్శించారు. శేషగిరిరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చావా కిరణ్, దూపాటి భద్రరాజు పాల్గొన్నారు.

సర్కార్ స్కూళ్లకు కొత్త యూనిఫాం

- తరగతుల వారీగా డిజైన్లు
- వేసవిలోనే పంపిణీకి కసరత్తు..
- ఖమ్మం జిల్లాలో 76,875 మంది విద్యార్థులకు లబ్ధి



ఖమ్మం ఖానాపురం హవేలీ, మే 16: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులంతా సమానమేనన్న భావన తెచ్చేందుకు ప్రభుత్వం ఏటా ఏకరూప దుస్తులను ఉచితంగా పంపిణీ చేస్తోంది. అయితే ప్రతి సంవత్సరం వస్త్రం అరకొరగా కేటాయిస్తుండటంతో సరిపడా దుస్తులు అందడం లేదు. సర్కారు బడుల్లో అత్యధికంగా పేద పిల్లలే చదువుతుండటంతో చిరిగిన దుస్తులతోనే వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇబ్బందులు అధిగమించేందుకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. 2024-25 సంవత్సరానికి సంబంధించి ఏకరూప దుస్తుల కోసం ముందస్తుగా వస్త్రాన్ని పంపిణీ చేయాలని నిర్ణయించింది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఈ నెలాఖరులోగా పూర్తిస్థాయిలో వస్త్రం అందించాలని భావిస్తున్నారు. ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ ప్రభుత్వ ఆదీనంలో నడుస్తున్న 1211 పాఠశాలలోని 76,875 మంది విద్యార్థులకు 16,8281 మీటర్ల వస్త్రం అవసరం ఉన్నట్లు విద్యాశాఖ అధికారులు గుర్తించారు. కార్పొరేట్ విద్యార్థుల తరహా యూనిఫామ్‌ను, ప్రభుత్వ విద్యార్థులకు అందించనున్నారు. తరగతుల వారీగా విద్యార్థులకు డిజైన్‌ను మార్చి అందించనున్నారు. మహిళా సంఘాలకు విద్యార్థుల యూనిఫాం కుట్టే బాధ్యతలను అప్పగించారు. ఒక్కో జతకు రూ.50 చెల్లించనున్నారు. దీనికి సంబంధించి బడ్జెట్‌ను ముందుగానే ఏర్పాటు చేసినట్లు తెలిసింది.

ప్రతి ఒక్కరికి రెండు జతలు...

రెక్కాడితే గాని డొక్కాడని పేదలు తమ పిల్లలకు దుస్తులు, పాఠ్య పుస్తకాల ఖర్చు తగ్గించుకునేందుకు ప్రభుత్వ బడులకే పంపిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఏటా రెండు జతల ఏకరూప దుస్తులు సరఫరా చేస్తున్నారు. గతంలో నాసిరకమైన వస్త్రం వచ్చేది. నాణ్యత లేకపోవడంతో త్వరగా చిరిగిపోతున్నాయని తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో విద్యార్థులకు ఆకర్షణీయ రంగుల్లో దుస్తులు అందించాలని సంకల్పించారు. నాణ్యమైన వస్త్రం సరఫరా చేయడంతో మన్నిక బాగుంటుందని అధికారులు చెబుతున్నారు. ఒక్కో విద్యార్థికి రెండు జతల దుస్తులు పంపిణీ చేయడంతో తల్లిదండ్రులపై ఆర్థిక భారం తగ్గినట్లయింది.

నెలాఖరులోగా పంపిణీ పూర్తి

ప్రతిసారీ ఏకరూప దుస్తుల పంపిణీ అస్తవ్యస్తంగా మారుతోంది. విద్యా సంవత్సరం ఆరంభం తర్వాత వస్త్రం రావడంతో దుస్తుల తయారీ సమస్యగా మిగులుతోంది. సగం ఏడాది దాటినా ఒక్క జత కూడా పంపిణీ చేయలేని పరిస్థితి నెలకొంటోంది. నిర్ణీత వ్యవధిలో వస్త్రం సరఫరా లేక దుస్తులు కుట్టడంలోనూ జా ప్యం జరుగుతోంది. గత అనుభవాల దృష్ట్యా విద్యాశాఖ వచ్చే ఏడాదికి ముందస్తు ఏర్పాట్లు చేపట్టింది. ఈ నెలాఖరులోగా జిల్లాలకు కేటాయించిన వస్త్రాల పంపిణీ పూ ర్తవుతుంది. కుట్టు మిషన్ల ఏజెన్సీలకు బాధ్యతలు కట్టబె ట్టి వేసవిలో దుస్తులను అందుబాటులోకి తేవాలని భావిస్తున్నారు.

బడులు తెరిచే నాటికి సిద్ధం

సోమశేఖర శర్మ, జిల్లా విద్యాశాఖ అధికారి

జూన్‌లో పాఠశాలల పునఃప్రారంభం నాటికి విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందేలా సిద్ధం చేస్తున్నాం. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా జిల్లాకు వస్త్రం చేరుతోంది. జిల్లా స్థాయిలో దుస్తులు కుట్టేందుకు కుట్టు యంత్రాల నిర్వాహకులకు బాధ్యతలు అప్పగించనున్నాం. 1నుంచి 12వ తరగతి ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు పుస్తకాలతో పాటు రెండు జతల ఏకరూప దుస్తులు, మధ్యాహ్న భోజనం తోపాటు నాణ్యమైన ఉచిత విద్యను అందిస్తున్నాం. తల్లితండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి, ప్రభుత్వం అందించే ప్రయోజనాలను విద్యార్థులు అందుకొనేలా చూడాలి.

సత్వర న్యాయమే లోక్ అదాలత్ ధ్యేయం

● జిల్లా ప్రధాన న్యాయాధికారి రాజగోపాల్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి రాజగోపాల్

ఖమ్మం లీగల్, మే 16: కక్షిదారులకు సత్వరన్యాయం అందించటానికి సంబంధికులందరూ సహకరించి జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధానన్యాయాధికారి జి.రాజగోపాల్ పిలుపునిచ్చారు. గురువారం కోర్టు హాల్‌లో జూన్ 8న జరగబోయే జాతీయ లోక్‌అదాలత్ విజయవంతం చేయటానికి వివిధ శాఖల అధికారులు, న్యాయాధికారులు, న్యాయవాదులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజీపడదగిన క్రిమినల్ కేసులలో ఇరుపక్షాల వారికి లోక్ అదాలత్ లాభాలను వివరించి, వారికి రాజీదిశగా కర్యోన్ముకులను చేయాలన్నారు. ఏదైనా ఒక క్రిమినల్ కేసులో ప్రధాన నేరం రాజీకి అనుకూలమైతే ఇతర చిన్న నేరాలను కూడా రాజీచేయవచ్చనే ఉన్నత న్యాయస్థానం తీర్పులను న్యాయాధికారి తెలిపారు. కొన్ని క్రిమినల్ కేసుల్లో ఒకవేళ ఇరుపక్షాల వారు రాజీపడితే చట్టం అనుమతించిన మేరకు నేరారోపణను బదలాయించి రాజీ చేయవచ్చన్నారు. దీనికి న్యాయాధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పోలీసులు కృషి చేయాలన్నారు. ఒకేరోజు ఎక్కువమంది కక్షిదారులు వస్తే ఇబ్బంది కలగకుండా ప్రతీరోజు లోక్ అదాలత్ నిర్వహించే విధంగా ఆదేశాలు జారీచేస్తానని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో న్యాయాధికారులు కె.ఉమాదేవి, వి.అపర్ణ, కె.వి.చంద్రశేఖర్‌రావు, ఎం.కల్పన, వై.బిందుప్రియ, వి.మాధవి, పోలీసు అధికారులు, ఎక్సైజ్ అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పాల్గొన్నారు.

అనంతరం చిట్‌ఫండ్, బ్యాంక్ రుణ గ్రహీతల సమావేశాన్ని న్యాయసేవాసదన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.రాజగోపాల్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 1300 కేసులలో కక్షిదారుల నష్టపరిహారం కోసం ఎదురుచూస్తున్నారన్నారు. వీటిని రాజీమార్గంలో లోక్ అదాలత్ ద్వారా పరిష్కరిస్తే బీమా కంపెనీతోపాటు బాధితులకు కూడా ప్రయోజనం చేకూరుతుందన్నారు. చిట్‌ఫండ్, బ్యాంకుల రుణగ్రహీతలకు రుణంలో తగ్గింపు, సులభ వాయిదాలు ఇచ్చినట్లయితే కేసులు ఎక్కువ సంఖ్యలో లోక్ అదాలత్‌లో రాజీ అవుతాయన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ లోక్ అదాలత్‌కు సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. ఈ సమావేశంలో బీమా కంపెనీల అధికారులు, న్యాయవాదులు, ఫైనాన్స్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఉపఎన్నిక ఏర్పాట్లు వేగవంతం చేయాలి

» కలెక్టర్ గౌతమ్

ఖమ్మం కలెక్టరేట్, మే 16: వరంగల్-ఖమ్మం-నల్లగొండ శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నిక ఏర్పాట్లు వేగవంతం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశించారు. ఖమ్మం కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్లో గురువారం అధికారులతో పోలింగ్ అధికారుల నియామకం, ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నిక పోలింగ్ ఈ నెల 27న, కౌంటింగ్ జూన్ 5న నిర్వహించనున్నట్లు తెలిపారు. పోలింగ్ సిబ్బంది నియామకం చేయాలన్నారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు 118 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 142మంది పీవోలు, 142 మంది ఏపీవోలు, 284మంది ఓపీవోలు అవసరం ఉన్నట్లు తెలిపారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులను పోలింగ్ విధులకు నియమించాలన్నారు. పోలింగ్ సిబ్బంది శిక్షణకు ఏర్పాట్లు చేయాలన్నారు.

అనంతరం ఏఆర్వోలతో సమావేశమై ఏర్పాట్ల గురించి కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలు కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తున్నందున ఏ దశలోనూ తప్పిదాలకు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 83,879మంది పట్టభద్రుల ఓటర్లు నమోదు కాగా, ఇందులో 50,676మంది పురుషులు, 33,199 మంది మహిళలు, 4 గురు ట్రాన్స్‌జెండర్లు ఉన్నారన్నారు. రిజర్వ్‌తో కలుపుకొని 129 బ్యాలెట్ బాక్సులు అవసరం ఉందని ఆయన తెలిపారు. 15ఫ్లయింగ్ స్క్వాడ్, 24 ఎంసీసీ 24 ప్రత్యేక వీడియో బృందాల ఏర్పాటుచేసి, నిఘా పకడ్బందీగా చేపట్టాలన్నారు. సెక్టార్ అధికారుల నియామకం పూర్తి చేయాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రాన్ని ఆర్డీవోలు, తహసీల్దార్లు సందర్శించి, వసతులను పర్యవేక్షించాలన్నారు. బ్యాలెట్ పత్రాల తనిఖీకి బృందం పోలీస్ గార్డ్‌తో వెళ్లి తీసుకురావాలన్నారు. ఓట ర్ స్లిప్పుల పంపిణీ ప్రధానమన్నారు. ఓటరుకు తమ ఓటుహక్కు ఎక్కడ ఉందో తెలియాలని సూచించారు. 100శాతం ఓటరు స్లిప్పులను పంపిణీ చేయాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో ఉంటుందని, రిసిప్షన్ కేంద్రం నల్లగొండలో ఉంటుందని కలెక్టర్ తెలిపారు.

సమావేశంలో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్, జిల్లా విద్యాధికారి సోమశేఖరశర్మ, జిల్లా ఉపాధి కల్పన అధికారి కొండపల్లి శ్రీరామ్, ఎల్డిఎం శ్రీనివాస రెడ్డి, ఎస్డీసీ రాజేశ్వరి, ఆర్డీవోలు గణేష్, రాజేందర్, కలెక్టరేట్ ఏవో అరుణ, సూపరింటెండెంట్‌లు మదన్ గోపాల్, రాంబాబు, సత్యనారాయణ, ఎంపీఐ వెంకటరమణ, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ సతీష్, ఎన్ఐసీ కో-ఆర్డినేటర్ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం స్ట్రాంగ్‌రూంలను నిరంతరం పర్యవేక్షించాలి



ఈవీఎం స్ట్రాంగ్‌రూం వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం కలెక్టరేట్, మే 16: ఈవీఎంలను భద్రపర్చిన స్ట్రాంగ్ రూమ్‌లను నిరంతరం పర్యవేక్షించాలని ఖమ్మం పార్లమెంటు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. గురువారం రిటర్నింగ్ అధికారి ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్‌లోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలను సందర్శించి, స్ట్రాంగ్ రూమ్ పర్యవేక్షణపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఖమ్మం, పాలేరు, వైరా, మధిర, సత్తుపల్లి, అశ్వారావుపేట, కొత్తగూడెం అసెంబ్లీ సెగ్మెంట్ల కౌంటింగ్ ప్రక్రియ శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతుందన్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద 3 అంచెల పటిష్ఠ భద్రత వ్యవస్థ ఏర్పాటు చేశామన్నారు. స్ట్రాంగ్ రూమ్ పూర్తి కవరేజతో సీసీ కెమేరాలు ఏర్పాటు చేశామని, వీటి ద్వారా స్ట్రాంగ్ రూమ్‌లను నిరంతరం పర్యవేక్షిస్తున్నామన్నారు. జిల్లా భూగర్భ జల శాఖ అధికారి శ్యామ్ ప్రసాద్, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ రాంబాబు, హస్సేన్, తదితరులు ఉన్నారు.

ఇల్లెందులో కుండపోత వర్షం

ఇల్లెందు మే 16: ఇల్లందు లో భారీ వర్షం కురిసింది. రాత్రి తొమ్మిదన్నర గంటల నుండి ఏకధాటిగా వర్షం కురిసింది. భారీ వర్షం కురవడం తో విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. ఇల్లందు మండలం వ్యాపితంగా భారీ వర్షం కురవడం తో వాతావరణం చల్ల బడింది. వేసవి తాపంతో ఇబ్బందులు పడిన ప్రజానీకం సాయంత్రం నుండే ఆకాశం మేఘావృతమై చల్లని ఈదురు గాలులతో ఊరట చెందారు..

ఏజెన్సీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వినతి



పీఆర్సీ కమిషన్ చైర్మన్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఆదివాసీ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు

టేకులపల్లి, మే 16: తెలంగాణ రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాలలో పని చేస్తున్న ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ఆదివాసీ టీచర్స్ ఫెడరేషన్ ప్రతినిధి బృందం గురువారం హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర 2వ పీఆర్సీ కమిషన్ చైర్మన్ ఎన్.శివశంకర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కమిషన్ చైర్మన్‌కు ఏజెన్సీ ప్రాంతంలోని ప్రత్యేక ప్రత్యేక పరిస్థితులను వివరించారు. 42శాతం ఫిట్‌మెంట్‌ను సిఫార్సు చేస్తూ ఏజన్సీ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగుల హెచ్ఆర్ఏ 15శాతం, ఏహెచ్ఆర్ఏ 12శాతం(సీలింగ్ పరిమితి ఎత్తివేస్తూ) ఎస్‌సీఏ 2,000 నుంచి 5,000 మధ్య పెంచుతూ తదితర డిమాండ్లను సిఫార్సు చేయాలని టీఎస్-ఏటీఎఫ్ పక్షాన ప్రాతినిధ్యం చేశారు. కమిషన్ చైర్మన్‌ను కలిసిన వారిలో టీఎస్-ఏటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మోకాళ్ల శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కబ్బాకుల రవి, రాష్ట్ర కార్యదర్శి కుంజా కృష్ణ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు పాయం ఆనందరావు, జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ ఊకె కృష్ణ తదితరులు ఉన్నారు.

రూ.10లక్షల విలువైన గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ఎండు గంజాయితో ఎక్సైజ్‌శాఖ అధికారుల

ఖమ్మం సంక్షేమవిభాగం, మే 16: ఒరిస్సా రాష్ట్రం నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న గంజాయిని ఖమ్మం ఎక్సైజ్‌శాఖ అధికారులు చాకచక్యంగా స్వాధీనం చేసుకున్నారు. గురువారం భువనేశ్వర్ నుంచి ముంబాయి వెళ్తున్న కొణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో గుర్తు తెలియని వ్యక్తులు అక్రమంగా గంజాయిని సరఫరా చేస్తున్నారనే విషయం తెలుసుకున్న ఖమ్మం ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్, సిబ్బందితో కలిసి కొణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఖమ్మంలో తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా ఉన్న రెండు సూట్ కేసులను తనిఖీ చేయగా, వాటిలో రూ.10లక్షల విలువైన 26కేజీల గంజాయిని గుర్తించారు. కాగా జిల్లా వ్యాప్తంగా పలు తనిఖీల్లో 300 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేంద్రరెడ్డి, డిప్యూటీ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి ప్రకటించారు.

వ్యక్తిపై అత్యాచారయత్నంపై కేసు నమోదు

సుజాతనగర్, మే 16: ఓ యువతిని అత్యాచారయత్నం చేసేందుకు ప్రయత్నించడంతో పాటు, కులం పేరుతో దూషిస్తూ దాడికి పాల్పడిన ఘటన గురువారం సుజాతనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సుజాతనగర్ గ్రామానికి చెందిన ఓ యువతిని ఈ నెల 12న రాత్రి సమయంలో ఆదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అత్యాచారయత్నానికి ప్రయత్నించబోయాడు. ఇంతలో ఆ యువతి కేకలు వేయగా... ఈ విషయం ఎవరికైనా చెబితే చంపుతానని బెదిరించి అక్కడి నుంచి పారిపోయాడు. కాగా ఇదే నెల 14వ తేదీన మధ్యాహ్న సమయంలో అత్యాచారయత్నానికి పాల్పడిన వ్యక్తితో పాటు అతని కుటుంబ సభ్యులైన భార్య, అన్న, తల్లి నలుగురు కలిసి యువతి కుటుంబ సభ్యులను బెదిరించి, కులం పేరుతో దూషిస్తూ యువతిపై దాడికి పాల్పడ్డారు. జరుగుతున్న గొడవను ఆపేందుకు ప్రయత్నించిన గ్రామస్థులను సైతం కులం పేరుతో దూషించారు. బాధితుల ఫిర్యాదు మేరకు అత్యాచారయత్నం, ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీతో పాటు, పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జుబేదా బేగం తెలిపారు.

విష గ్రాసం తిని 80 గొర్రెలు మృత్యువాత

తిరుమలాయపాలెం, మే16: విషపూరితమైన గ్రాసం తిని సుమారు 80 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. రాజారం గ్రామానికి చెందిన తేళ్ల కొమరయ్య, బయమ్మ, గాలయ్య, లింగయ్య, నరేష్‌లు కలిసి గురువారం లాల్‌సింగ్‌తండా లో బుధవారం సాయంత్రం గొర్రెలు, మేకలను తీసుకెళ్లారు. ఈక్రమంలో తండాకు చెందిన ఓ రైతు వ్యవసాయక్షేత్రంలో పెసర సాగు చేసిన అనంతరం మిషన్‌తో పెసర పంట కోశాడు. చేలో ఉన్న గడ్డిమొక్కలను తొలిగించేందుకు గడ్డిమందును పిచికారి చేశాడు. విషపూరితమైన గ్రాసం తిన్న ఆ గొర్రెలు బుధవారం రాత్రి నుంచి ఒక్కొక్కటిగా మృతి చెందాయి. గురువారం మొత్తం సుమారు 80గొర్రెలు మృతి చెందాయి. తమను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని బాధితులు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో ఆదివాసీ మహిళ దుర్మరణం



వెంకటమ్మ మృతదేహం

దుమ్ముగూడెం మే 16: విద్యుదాఘాతంతో ఆదివాసీ మహిళ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని లచ్చిగూడెంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..లచ్చిగూడేనికి చెందిన ఆదివాసీ మహిళ కట్టం వెంకటమ్మ(50) తన సొంత మేకలను మేపుకొని ఇంటికి తోలుకొస్తున్న క్రమంలో ఒక మేక విద్యుత్ సబ్-స్టేషన్ సమీపాన ఒక డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్త్ వైరుకు తగిలి విద్యుదాఘాతానికి లోనై చిక్కుకుంది. అప్పటికే వర్షానికి తడిచిన ఆమె ఆ మేకను తప్పించే క్రమంలో విద్యుదాఘాతం అవ్వడంతో కిందపడిపోయింది. స్థానికులు క్షతగాత్రురాలిని వెంటనే భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతురాలి భర్త గతంలోనే మృతి చెందగా, వివాహితులైన ముగ్గురు పిల్లలున్నారు.

వ్యక్తిని గాయపరిచిన ఘటనలో ఒకరిపై కేసు

పాల్వంచ, మే16: వ్యక్తిని గాయపరిచిన ఘటనలో ఒకరిపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణ పరిధిలోని బంగారుజాలకు చెందిన సున్నం పెద్దిరాజు బుధవారం ఆ గ్రామంలో జరుగుతున్న క్రికెట్ మ్యాచ్‌ను తిలకించడానికి వెళ్లాడు. ఆదే సమయంలో మ్యాచ్‌ను చూసేందుకు అక్కడకు వచ్చిన సన్నం రామకృష్ణ, పెద్దిరాజుతో ఆకారణంగా వాగ్వాదానికి దిగాడు. అంతటితో ఆగకుండా కుటుంబసభ్యుల పేరుపెట్టి దుర్భాషలాడుతూ అతడిపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం పెద్దిరాజు పోలీసులకు ఫిర్యాదు చేయగా, రామకృష్ణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్ఐ బానాల రాము తెలిపారు.

నిధులొచ్చినా.. నిర్మాణాల ఏర్పాటేదీ?

- విద్యార్థులు లేరనే సాకు చూపుతున్న అధికారులు?
- రూ1.80కోట్ల నిధులను దారి మళ్లించే యత్నం
- ముందుకు కదలని ఆశ్రమపాఠశాల భవన నిర్మాణ పనులు



వసతులు లేని ఆశ్రమపాఠశాల

దుమ్ముగూడెం, మే16: నిధులొచ్చాయన్న విద్యార్థుల ఆశ అంతలోనే ఆవిరైంది. వసతుల కోసం ఏళ్ల తరబడి ఎదురు చూసిన ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు మరో మారు మొండిచేయి ఎదురైంది. ఆధునీకరణ పనులకు శంకుస్థాపన జరగ్గా, ఏవో కారణాలు చూపుతూ నిధులు మంజూరైన చోట పనులకు మంగళం పలికి మరో చోటకు మళ్లించేందుకు గిరిజన సంక్షేమశాఖలోని ఓ ఉన్నతాధికారి యత్నిస్తున్నారని తెలుస్తోంది. దీంతో వసతిగృహంలో మౌలిక సదుపాయాలు అటకెక్కనున్నాయి. కొన్నేళ్లుగా నారాయణరావుపేట గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నతపాఠశాల విద్యార్థులకు సరైన మౌలిక సదుపాయాలు లేవు. సుమారు ఎనిమిదేళ్ల క్రితం ఉన్నతపాఠశాలగా అప్‌గ్రేడ్ ఐన నారాయణరావుపేట ఆశ్రమపాఠశాల వసతులు లేని కారణంగా నానాటికీ విద్యార్థులు తగ్గుముఖం పడుతున్నారు. గతంలో 200 వందలకు పైగా విద్యార్థుల సంఖ్యా సామర్థ్యం ఉండగా, నేడు 138 మంది విద్యార్థులు ఉన్నారు. నలభై ఏళ్ల క్రితం నిర్మించిన వసతిగృహం పూర్తి శిథిలావస్థకు చేరడంతో ప్రస్తుతం ఈ పాఠశాలలో తరగతి గదులు, వసతిగృహం కలిపి నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం విద్యార్థులు నివాసం ఉంటున్న అదనపు తరగతి గదులకు వర్షపునీరు దిగడం, గోడలకు విద్యుత్ ప్రసరించడంతో విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం పాఠశాలలో మొత్తం ఏడు గదులుండగా, వాటిలో సైన్స్ ల్యాబ్, ఆఫీస్‌రూం, స్టాఫ్‌రూంలకు రెండు గదులు పోగా, మిగతా ఐదింటిలో తరగతులు జరుగుతున్నాయి. కాగా మిగతా ఐదు గదుల్లోనూ ఆరోతరగతిలో కంప్యూటర్ రూంను ఏర్పాటు చేశారు. లైబ్రరీకు ప్రత్యేకంగా గది లేదు. అలాగే స్పోర్ట్స్ రూం కూడా లేదు. మండలంలో మొత్తం ఎనిమిది గిరిజన ఆశ్రమపాఠశాలలుండగా, వాటిలో ఐదు బాలికలకు, మూడు మాత్రమే బాలురకున్నాయి. విద్యార్థుల సంఖ్యా సామర్థ్యం సమంగా ఉన్నప్పటికీ, కేవలం రెండింటిలోనే బాలురకు పూర్తి వసతులున్నాయి. పలు ఆదివాసీ గ్రామాలకు కేంద్రంగా ఉన్న నారాయణరావుపేట బాలుర ఆశ్రమ పాఠశాల వసతులపై అధికారులు దృష్టి సారిస్తే విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

వసతుల్లేక తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య

వసతులు లేని కారణంగా నారాయణరావుపేట ఆశ్రమపాఠశాలలో విద్యార్థుల సంఖ్య నానాటికీ తగ్గుతూ వస్తుందని స్థానిక ఆదివాసీలు అభిప్రాయపడుతున్నారు. విద్యార్థులు లేకపోతే కొత్త నిర్మాణాలు ఇక్కడ ఎందుకని ఐటీడీఏ డీడీ భావిస్తున్నట్లు సమాచారం. ఈనిధులను మరో చోట నిర్మాణాలకు వినియోగించాలనే ఆలోచనలో డీడీ ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పన్నెండు అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం ఇటీవల రూ.1.80 కోట్లు మంజూరయ్యాయి. ఇవి పూర్తయితే ఈ నిర్మాణాలను డార్మెటరీకు ఉపయోగపడే అవకాశం ఉంది. ప్రస్తుత ఎన్నికల కోడ్ రాక ముందే కాంట్రాక్టరు పనులను ప్రారంభించారు. అధికారులు వద్దంటున్నారనే కారణం చూపుతూ కాంట్రాక్టరు పనులు మొదలు పెట్టకుండానే మధ్యలోనే నిలిపివేశాడు. దీంతో నారాయణరావుపేట ఆశ్రమపాఠశాల ఆధునికీకరణ పనులు ముందుకు సాగడం లేదు. దీనిపై స్థానిక ఆదివాసీలు సైతం ఐటీడీఏ పీవోను కలిసి పనులు ప్రారంభించేలా ఆదేశించాలని వినతిపత్రం సైతం సమర్పించారు.

పనులు ప్రారంభించాలి

ఎస్ఎంసీ చైర్మన్ పాయం తిరుపతిరావు



ఐటీడీఏ పీవో ప్రత్యేక చొరత తీసుకొని నారాయణరావుపేట ఆశ్రమపాఠశాల ఆధునికీకరణకు మంజూరైన రూ.1.80 కోట్ల నిధులతో పనులను వెంటనే ప్రారంభించాలి. సరైన వసతులు లేక విద్యార్థులు ఏళ్ల తరబడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వసతులు పెరిగితే విద్యార్థుల సంఖ్య కూడా పెరుగుతుందన్నారు.

నీటి సంపులో పడి రెండేళ్ల బాలుడి మృతి



బాలుడు సాయిరాం మృతదేహం

సత్తుపల్లి రూరల్, మే16: ఆడుకుంటూ వెళ్లి నీటి సంపులో పడి రెండేళ్ల బాలుడు మృతి చెందిన సంఘటన గురువారం ఖమ్మం జిల్లా సత్తుపల్లి పట్టణంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రంలోని గంజాం జిల్లా బోడారామ్‌పల్లి గ్రామానికి చెందిన కేదార్‌దాస్ తన భార్య, ఇద్దరు కుమారులతో కలిసి సత్తుపల్లిలోని ద్వారకాపూరి కాలనీ రోడ్-4లో ఓ సింగరేణి ఉద్యోగి నూతనంగా నిర్మిస్తున్న భవనంలో పనులకు వెళ్లాడు. ఈ క్రమంలో చిన్న కుమారుడు సాయిరామ్ (2) ఆడుకుంటూ వెళ్లి నీటి సంపులో పడిపోయాడు. ఇది గమనించని తల్లిదండ్రులు బాలుడి కోసం చుట్టుపక్కల వెతికినా కనిపించకపోవడంతో చివరికి సంపులో గుర్తించి ఆటోలో సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు బాలుడు అప్పటికే మృతి చెందినట్లు తెలిపి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



ఆసుపత్రి వద్ద రోదిస్తున్న బాలుడి తల్లిదండ్రులు

కేటీపీఎస్ యాష్‌పాండ్‌లో చోరీ

పాల్వంచ, మే 16: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండల పరిధిలోని కేటీపీఎస్ యాష్‌పాండ్‌లో గురువారం పైపులు చోరీకి గురయ్యాయి. దుండగులు దొంగిలించిన పైపులను పాల్వంచ పట్టణంలోని ఓ స్క్రాప్ దుకాణంలో వారు విక్రయిస్తుండగా, ఎస్‌పీఎఫ్ సిబ్బంది దాడి చేసి పట్టుకున్నారు. కేటీపీఎస్ యాజమాన్యానికి సమాచారం అందించడంతో పాటు పట్టుకున్న ట్రాక్టర్‌ను, అందులోని ఇనుప పైపులను పాల్వంచ టౌన్ స్టేషన్‌కు తరలించారు. కానీ ఫిర్యాదు చేయడానికి కేటీపీఎస్ యాజమాన్యం సంశయిస్తుందని తెలుస్తోంది. చోరీ జరిగిన ప్రదేశం పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధి కాగా, చోరీ సొత్తు అమ్మడానికి ప్రయత్నించిన ప్రదేశం పాల్వంచ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి రావడంతో ఎక్కడ ఫిర్యాదు చేయాలనే సంశయంలో కేటీపీఎస్ యాజమాన్యం, ఎస్‌పీఎఫ్ అధికారులు ఉన్నట్లుగా తెలుస్తోంది. ఈ విషయంపై పాల్వంచ రూరల్ ఎస్ఐ శ్రీనివాస్‌ను వివరణ కోరగా తమ వద్దకు ఎటువంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

చెల్లని చెక్కు కేసులో మహిళకు ఆరు నెలల జైలు శిక్ష

ఖమ్మం లీగల్ మే 16: చెల్లని చెక్కు కేసులో ఓ మహిళకు ఆరు నెలల జైలు శిక్షతో పాటు, రూ. 4లక్షలను ఫిర్యాదికి చెల్లించాలని ఖమ్మం రెండో అదనపు జిల్లా ప్రధాన న్యాయాధికారి వెంపటి అపర్ణ శిక్ష ఖరారుచేస్తూ గురువారం తీర్పుచెప్పారు. వివరాల ప్రకారం...ఖమ్మం నగరంలోని శ్రీరామ్‌గిరి బైపాస్ రోడ్ ప్రాంతానికి చెందిన ఫిర్యాది ఎం.సత్యనారాయణ వద్ద నిందితురాలు ముచ్చింతల సీత సెప్టెంబరు 6 2015న తన కుటుంబ అవసరాల నిమిత్తం రెండు లక్షల యాభైవేల రూపాయలు అప్పు తీసుకుని ఆదేరోజు ప్రాంసరీనోటు రాయించి ఇచ్చింది. ఫిర్యాది తన రుణం తిరిగి చెల్లించమని ఒత్తిడి చేయగా, రెండు లక్షల రూపాయలకు 2016 మార్చి 2 నిందితురాలు అతడికి చెక్కు జారీ చేసింది. అట్టి చెక్కును ఫిర్యాది తన బ్యాంకు ఖాతాలో జమచేయగా, అందులో సరిపడ నగదు లేకపోవడంతో చెక్కు తిరస్కరణకు గురైంది. ఫిర్యాది తన న్యాయవాది తలారి మంగయ్య ద్వారా లీగల్ నోటీస్ జారీచేసి కోర్టులో ప్రైవేటు కేసు దాఖలు చేయగా, అట్టి కేసును విచారించిన మద్యపాన అబ్కారి ప్రత్యేక న్యాయస్థాన న్యాయాధికారి రాళ్ళబండి శాంతిలత విచారించారు. నిందుతురాలిపై నేరం రుజువు కావడంతో 2023న పైవిధంగా శిక్షవిధిస్తూ తీర్పు చెప్పారు. కాగా నిందితురాలు జిల్లా కోర్టుకు అప్పీల్ చేసుకోగా, న్యాయాధికారి క్రింది కోర్టు ఇచ్చిన తీర్పును ఖరారు చేస్తూ గురువారం తీర్పు వెల్లడించారు.

అనుమతుల పేరుతో ఇష్టారాజ్యంగా చెరువు మట్టి తవ్వకాలు!

- గుబ్బగుర్తిలో అడ్డుకున్న మత్స్యకారులు
- అనుమతులతోనే అంటున్న తవ్వకందారులు

కొణిజర్ల, మే16: చెరువులో మట్టితోలకాలు అనుమతుల పేరుతో రైతుల పొలాలకే కాకుండా బయటకు తోలుతున్నారని తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. అనుమతులు ఇస్తున్న అధికారులు చెరువులో ఎంతలోతు వరకు తీస్తున్నారో పరిశీలించడం లేదని, దాంతో తవ్వకందారులు అదే అదునుతో పెద్దపెద్ద గుంతలు తీస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. మండల పరిధిలోని గుబ్బగుర్తి పెద్దచెరువులో రెండు రోజుల నుంచి పలువురు మట్టి తోలకాలు జరుపుతున్నారు. రైతుల పేరుతో అనుమతులు తీసుకొని నిబంధనలకు వ్యతిరేకంగా గుంతలు పెట్టి, ఎక్స్‌కవేటర్లతో తోలకాలు జరుపుతున్నారని గురువారం చెరువు మత్స్యసొసైటీ సభ్యులు తవ్వకాలను అడ్డుకున్నారు. చెరువులో లోతులో మంచి మట్టివస్తుందని, నిబంధనలను తుంగలో తొక్కి లోతుగా గుంతలు తీయడం వలన ఇబ్బందులు కలుగుతాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దపెద్ద గుంతలు తీయడానికి అనుమతులు ఎలా ఇస్తారని వారు ప్రశ్నిస్తున్నారు. తవ్వకందారులు మాత్రం అనుమతులు పొంది చెరువుమట్టిని తోలుతున్నామని తెలుపుతున్నారు. చెరువు మట్టిని బయటకు ఎలా తరలిస్తారని మత్స్యకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇష్టం వచ్చిన్నట్లు గుంతలు తీస్తే ప్రమాదాలు నెలకొంటాయని ఆవేదన చెందుతున్నారు. తవ్వకందారులు, మత్స్యకారులు గొడవ తీవ్రం అవుతుండటంతో పోలీసులు అక్కడకు చేరుకొని ఇరువురిని సముదాయించారు. ఈ విషయంపై ఇరిగేషన్ ఏఈ అబీబ్‌ను వివరణ కోరగా గుబ్బగుర్తి పెద్దచెరువు మట్టితోలకాలకు అనుమతులు ఉన్నాయన్నారు. రెండు అడుగులలోతు వరకు తవ్వకాలు జరపవచ్చని, ఆపై తీస్తే చర్యలు తీసుకుంటామన్నారు. చెరువుమట్టిని రైతులు ఉపయోగించుకోవాలన్నారు.



తవ్వకందారులను అడ్డుకుంటున్న మత్స్యకారులు (ఇన్‌సెట్‌లో చెరువులో లోతుగా తీసిన గుంత)

రైతులకు రూ.500 బోనస్ వెంటనే చెల్లించాలి

మణుగూరుటౌన్, మే 16 : ఆరుగాల కష్టపడి పంటను సాగుచేసిన రైతులకు వెంటనే రూ.500 బోనస్‌ను చెల్లించాలని జడ్పీటీసీ సభ్యుడు పోశం నర్సింహారావు డిమాండ్ చేశారు. గురువారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్ రాఘవరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల హామీల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ రైతులు పండించి ప్రతీ క్వింటా ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లిస్తామని చెప్పి ఇప్పుడు కేవలం సన్న బియ్యానికి మాత్రమే బోనస్ ఇస్తాననడం దారుణమన్నారు. ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా కొనుగోలు చేసిన ధాన్యానికి బోనస్ ఇచ్చిన దాఖలు లేవని, దీంతో కాంగ్రెస్ పార్టీకి, సీఎం రేవంత్‌రెడ్డికి రైతుల సంక్షేమం పట్ల ఏ పాటి చిత్తశుద్ధి ఉందో అర్థం చేసుకోవాలన్నారు. రైతులను, ప్రజలను మోసం చేసేందుకే హామీల మీద హామీలు ఇచ్చారని, ఇప్పుడు హామిలన్నింటిని ఎగవేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. రైతులకు బోనస్ వేసేవరకు విశ్రమించేది లేదని ఆయన పేర్కొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే డెంగ్యూ నివారణ

పలు చోట్ల డెంగ్యూ నివారణ దినోత్సవ ర్యాలీలు

అశ్వారావుపేట రూరల్, మే 16: డెంగ్యూ వ్యాధి ప్రజలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజల భాగస్వామ్యంతోనే వ్యాధి నివారణ సాధ్యమవుతుందని వినాయకపురం, గుమ్మడివల్లి ప్రభుత్వ వైద్యశాలల వైద్యులు రాం దాస్, మధులిక అన్నారు. ఆయా పీహెచ్‌సీల ఆధ్వర్యంలో గురువారం జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా ర్యాలీలు జరిపారు. ఈసందర్భంగా ప్రజలకు డెంగ్యూ వ్యాధిపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో సబ్‌యూనిట్ అధికారి ఆజ్మీర వెంకటేశ్వరరావు, హెచ్‌ఈవో రాజు, హెచ్ఎస్ శ్రీను, సీహెచ్‌వో జయశ్రీ, ఎంటీఎస్ విజయ్‌రెడ్డి, హెచ్‌వీ దుర్గ, హెల్త్ అసిసెంట్లు, ఏఎన్ఎంలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కలిసికట్టుగా డెంగ్యూను తరిమేద్దాం

ఆళ్లపల్లి: కుటుంబ సభ్యులు కలిసికట్టుగా ఇంటి పరిసర ప్రాంతాలను ప్రతి రోజు పరిశుభ్రం చేసుకుంటే దోమలను నివారించి డెంగ్యూను తరిమేయవచ్చని ఆళ్లపల్లి పీహెచ్‌సీ వైద్యురాలు సంఘమిత్ర గ్రామస్తులకు తెలిపారు. గురువారం జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా ఆమే పీహెచ్‌సీ సిబ్బందితో కలిసి డెంగ్యూ నివారణకు చేయాల్సిన కార్యాక్రమాలపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశవర్కర్లు, ఏఎన్ఎమ్స్ పాల్గొన్నారు.

కరకగూడెంలో..

కరకగూడెం: మండల కేంద్రంలో గురువారం జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా కరకగూడెం వైద్యాధికారి మధు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఇంటి పరిసరాల్లో నిల్వ నీరు లేకుండా చూడాలని నిల్వనీరులో లార్వా లేకుండా ప్రతి మంగళవారం శుక్రవారం డ్రైడేడ్ ఆక్టివిటీస్ పాటిస్తూ దోమలను అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ కృష్ణ, నరసింహారావు, ఏఎన్ఎంలు రుక్మిణి, నాగరత్నం, సుజాత, రమాదేవి, జ్యోతి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

జూలూరుపాడులో..

జూలూరుపాడు: దోమల వ్యాప్తిని అరికట్టినట్లైతే డెంగ్యూ వ్యాధి ప్రబలకుండా నివారించవచ్చని ప్రభుత్వ వైద్యాధికారి బి.వెంకటేశ్వర్లు తెలిపారు. జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జూలూరుపాడులో ప్రభ్వుత వైద్యశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. డెంగ్యూ వ్యాధి ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో డెంగ్యూ ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు దోమతెరలను ఉపయోగించుకోవాలన్నారు. ప్రజలు వ్యాధి సోకకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి పి.వినోద్, సీహెచ్‌వో వి.వెంకటేశ్వర్లు, హెల్త్‌సూపర్‌వైజర్లు రత్నకుమార్, రాధిక తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంలో..

భద్రాచలం: భద్రాచలంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గురువారం జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుబాష్ మాట్లాడుతూ డెంగ్యూకు పూర్తిస్థాయి నివారణే తప్ప చికిత్స లేదని, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారానే అది సాధ్యమవుతుందన్నారు. దోమలను నివారించడం ద్వారానే డెంగ్యూను అరికట్టవచ్చునని అన్నారు. దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. పరసిరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈవో కృష్ణయ్య, డీపీఎంవో ముత్యాలరావు, సద్గుణవాణి, హెచ్‌వి, ఎఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆళ్లపల్లిలో నిర్వహించిన ర్యాలీ

జిల్లా స్థాయి స్థాయీ సంఘం సమావేశాలు


సమావేశంలో మాట్లాడుతున్న కంచర్ల చంద్రశేఖర్‌రావు

కొత్తగూడెం, మే 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏడు విభాగాలకు చెందిన జిల్లాస్థాయి సంఘాల సమావేశాలు గురువారం నిర్వహించారు. ఈ సమావేశాలకు చైర్‌పర్సన్, జిల్లా ప్రజాపరిషత్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఇంటి నెంబరు లేని గృహాలకు యూజర్ చార్జెస్ వసూలు చేసి ఇంటి నెంబరు, కరెంట్ మీటర్లు పొందే విధంగా చూడాలని ఆయన కొత్తగూడెం జిల్లా పంచాయతీ అధికారిని కోరారు. జిల్లా ప్రజాపరిషత్ భద్రాద్రి కొత్తగూడెం వారు జిల్లాలో పరిశ్రమలను నూతనంగా ఏర్పాటు చేయడానికి వంద ఎకరాల భూమి కోసం ప్రతిపాదనను చేయడం జరిగిందన్నారు. కొత్తగూడెం జిల్లాలో రెండు పడకల గదుల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కోరారు, రాబోవు వర్షాకాలంలో ప్రజలకు అంటు వ్యాధులు రాకుండ ముందుగా శానిటేషన్ పనులు చేపట్టవల్సిందిగా అందుకు ముందస్తు ప్రణాళికను తయారు చేసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు. పౌష్టికాహారం పథకం కింద 34,543 మంది ఆరు నెలల నుంచి 3సంవత్సరాల వయస్సు గల పిల్లలు లబ్ధి పొందుతున్నారని వీరికి బాలామృతం పాటు నెలలో 16రోజులు గుడ్లు అందించడం జరుగుతుందని మార్చి, ఏప్రిల్ 2024 నెలలకు గాను పోషణ్‌మహాలో భాగంగా గ్రోత్ మానిటరింగ్ డ్రైవ్ ద్వారా ఎస్ఎఎం (241)/ ఎంఎఎం (768) పిల్లలను గుర్తించి పోషకాహారం ఇవ్వడం జరుగుతుందని జిల్లా స్త్రీ, శిశు, దివ్యాంగుల సంక్షేమశాఖాధికారి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో 12,294 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హజరుకాగా అందులో 11,112 మంది ఉత్తీర్ణత పొందారని జిల్లా విద్యాశాఖాధికారి తెలిపారు. ఈ సమాశంలో జిల్లా ప్రజా ప్రాథమిక నియోకవర్గ సభ్యులు ఎస్.ప్రసూనారాణి, ముఖ్య కార్యనిర్వహణాధికారి, జిల్లా ప్రజాపరిషత్ భద్రాద్రి జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వ్యాపారుల సమస్యలను పరిష్కరించాలి

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మే 16: వ్యాపారస్తుల సమస్యలను పరిష్కరించాలని కొత్తగూడెం వ్యాపారస్తుల సంక్షేమ సంఘం సభ్యులు మున్సిపల్, విద్యుత్ అధికారులను కోరారు. గురువారం పట్టణంలో వివిధ సమస్యలపై అధికారులను కోరుతూ తక్షణమే వాటిని పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా పెద్ద బజార్, చిన్న బజార్ ప్రాంతాలలో రహదారులను నూతనంగా నిర్మించాలన్నారు. అదేవిధంగా డ్రైనేజీ సమస్య, విద్యుత్ స్తంభాల సరైన ప్రాంతంలో వేయాలన్నారు. సులభ కాంప్లెక్స్ నిర్మాణాలు చేపట్టి రైతు బజార్ ప్రాంతంలో నగదు పార్కింగ్‌ను ఏర్పాటు చేసి వాహనదారులకు, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని కోరారు. సమావేశంలో సభ్యులు దుర్గాప్రసాద్, భవానీ ప్రసాద్, వాసు, అబిద్, కూర శ్రీధర్, మధు, అనూప్ ఖండేల్వాల్ పాల్గొన్నారు.

విద్యార్థులు జీవితంలో స్థిరపడాలి


సన్మానం పొందిన వారితో మైనారిటీ సభ్యులు

బూర్గంపాడు, మే 16: విద్యార్థులు భవిష్యత్తులో కూడా ఉన్నత చదువులు చదివి జీవితంలో స్థిరపడాలని తెలంగాణ మైనార్టి రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ గీత అన్నారు. ఇంటర్మీడియట్, పదవ తరగతి ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచిన ముస్లిం మైనార్టి విద్యార్థులను గురువారం మజీద్ ఏ దావత్ సారపాక కమిటి ఆధ్వర్యంలో సారపాకలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సన్మానించారు. శాలువలతో సత్కారించి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు.

పాఠశాలలను త్వరగా సిద్ధం చేయండి

ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్

పాల్వంచ, మే 16: గిరిజన సంక్షేమశాఖ పరిధిలోని పాఠశాలలు, వసతి గృహాలలో మైనర్ రిపేర్లు, ప్యాచ్ వర్క్, బల్లల రిపేర్లు ఈ నెల 20 తేదీ నాటికి పూర్తి చేసి సిద్ధంగా ఉంచాలని. ప్రధానోపాధ్యాయులు ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ ఆదేశించారు. గురువారం పాల్వంచ మండలంలోని కిన్నెరసాని బాలుర ఆశ్రమ పఠశాల, పాల్వంచలోని బాలికల వసతిగృహాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలోని టాయిలెట్లు, వాష్ రూమ్‌లు, డార్మెటరీ, తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ఇంటిని ఏవిధంగా శుభ్రంగా ఉంచుకుంటారో అదే విధంగా పాఠశాలలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ప్రతి తరగతి గది, డైనింగ్‌హాల్, డార్మెటరీలలో గాలి, వెలుతురు సక్రమంగా వచ్చేలా ఏర్పాట్లు చేయాలన్నారు. క్రిమికీటకాలు లోనికి రాకుండా వెంటిలేటర్స్‌కు మెష్‌లు ఏర్పాటు చేయాలన్నారు. పాఠశాలలు తెరిచే నాటికి విద్యార్థులు రాగానే వారు తమ ఇంటిని మరిపోయేలా సకర్యాలు ఉండాలని అన్నారు. మరలా ఆకస్మిక తనిఖీకి వచ్చేనాటికి అన్ని రకాల పనులు పూర్తి చేయాలని లేని యెడల సంబందిత సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.


ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేస్తున్న పీవో

'పది' విద్యార్థులకు ఘన సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న దృశ్యం

అశ్వాపురం, మే 16: ఇటీవల ఎస్ఎస్‌సీ, సీబీఎస్ఈ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన పది మంది విద్యార్థులను మణుగూరు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సన్మానించారు. గురువారం అశ్వాపురం కాలువ బజారులోని షిర్డీ సాయిబాబా ఆలయంలో జరిగిన కార్యక్రమంలో సీబీఎస్ఈలో అత్యధిక మార్కులు సాధించిన ఎం.జశ్వితమాలతి, చరణ్, ఎస్ఎస్‌సీలో అత్యధిక మార్కులు సాధించిన గణేష్‌ను ప్రత్యేకంగా శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో చార్టర్ ప్రెసిడెంట్ హరిబాబు, జోనల్ ప్రెసిడెంట్ తారా ప్రసాద్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పూర్ణచంద్రరావు,సెక్రటరీ మీరా హుస్సేన్, అశ్వాపురం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు

తెలంగాణ ఉద్యమంలో రాందాస్ కీలకం



నివాళులర్పిస్తున్న దృశ్యం

కొత్తగూడెం టౌన్, మే 16 : తొలిదశ తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన పొలిశెట్టి రాందాస్ తెలంగాణ ఉద్యమకారులకు మార్గదర్శంగా నిలిచారని 1969 తెలంగాణ ఉద్యమకారుల సంఘం నాయకులు కందుకూరి మదనయ్య తెలిపారు. గురువారం బస్టాండ్‌సెంటరులోని తెలంగాణ ఉద్యమకారుల స్థూపం వద్ద రాందాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనారోగ్యంతో ఇటీవల రాందాస్ మృతి చెందడం బాధాకరమన్నారు. రాందాస్ ఆశయాలను సాధించాలని కోరారు.

శాస్త్రీయ ఆలోచనతోనే అభివృద్ధి

పాల్వంచ టౌన్, మే 16 : పాల్వంచ పట్టణం కొమరం బీం హల్ (షేక్ ఫాతిమానగర్) బహుజన ఐక్యవేదిక ఆధ్వర్యంలో గురువారం శాస్త్రీయ ఆలోచన విధానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యవక్తగా మూఢ నమ్మకాల నిర్మూలన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి నరేష్ ముఖ్య అతిధిగా హజరై మాట్లాడారు. సమాజంలో రోజురోజుకు మూఢనమ్మకాలను పెంచి పోషిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని, ప్రజలు శాస్త్రయబద్ధంగా ఆలోచించకుండ ఎవరు ఏది చెప్పే అదేగుడ్డిగా నమ్మి నిత్యం మోసపోతున్నారన్నారు. ప్రతి చిన్న విషయానికి మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకోవడం లేదా అనవసరమైన విషయాలకు కూడా ఆవేశపరులుగా తయారై దాడులు, హత్యలు చేయడం లాంటి ఘటనలకు పూనుకుంటున్నారని వివరించారు. వందల ఏళ్లుగా ప్రజలను మూఢనమ్మకాల్లో ముంచి ప్రతి విషయానికి కులం, మతం, రాత, కర్మ, దురదృష్టం, వాస్త తదితర కట్టుకథలు చెప్పి స్వర్గ, నరకాల పేరుతో భ్రమల్లోకి నెడుతున్నరని అందుకే ప్రజలు మూఢనమ్మకాలను విడనాడి ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ వాస్తవాలను తెలుసుకుని జ్ఞానవంతులుగా ఎదుగాలని అందుకు అంబేద్కర్, జ్యోతిరావుపూలే, పెరియార్ లాంటి మహనీయుల జీవిత, పోరాట చరిత్రలు తెసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన ఐక్యవేధిక రాష్ట్ర నాయకులు దేవదానం మూఢనమ్మకాల నిర్మూలన సంఘం రాష్ట్ర నాయకులు నబీసాహెబ్, క్రాంతి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బైరి నరేష్

మల్టీ వర్కర్ కుటుంబానికి ఆర్థిక సాయం

అన్నపురెడ్డిపల్లి, మే 16: మండలంలోని జానకీపురం(ఊటుపల్లి)పంచాయతీలో మల్టీ వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్న లింగనబోయిన గోపాలకృష్ణ మృతికి జిల్లాలోని పలు మండలాల పంచాయతీ కార్యదర్శులు ఆ కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు. జానకీపురం గ్రామ పంచాయతీలో మల్టివర్కర్‌గా పని చేస్తున్న గోపాలకృష్ణ మెదడు సంబంధిత వ్యాదితో ఇటీవల మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి మల్టివర్కర్లు, పంచాయతీ కార్యదర్శులు తమవంతు సాయం అందించి ఆ కుటుంబానికి అండగా ఉండి దశదిన కర్మలు గురువారం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు మండలాల పంచాయతీ కార్యదర్శులు సుమారు రూ65వేల నగదును ఆ కుటుంబానికి అందజేశారు.

సింగరేణిలో స్థానికులకు ప్రాధాన్యమివ్వాలి

రుద్రంపూర్, (సింగరేణి) మే 16: సింగరేణి యాజమాన్యం చేపట్టే నూతన నియామకాల్లో స్థానిక నిరుద్యోగ యువతకు అవకాశాలు కల్పించాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ విద్యార్థి యువజన సంఘం అధ్యక్షులు కోటా శివశంకర్ విజ్ఞప్తి చేశారు. సింగరేణిలోని వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాంకు గురువారం వినతిపత్రం అందచేసినట్లు తెలిపారు. గత కొంతకాలంగా ఉద్యోగనియామకాలు చేపట్టకపోవడం వల్ల నిరుద్యోగుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుందని, సింగరేణి యాజమాన్యం నూతన నియామకాలకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

భద్రాద్రి రామయ్యకు నిత్య కల్యాణం

భద్రాచలం, మే 16: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి నిత్యకల్యాణం గురువారం వైభవంగా నిర్వహించారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహావచనం, కంకణధారణ, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ వైదిక సిబ్బంది ఘనంగా నిర్వహించారు.

రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్

చుంచుపల్లి, మే 16: రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని కొత్తగూడెంలో బిఆర్ఎస్ శ్రేణులు గురువారం నిరసన నిర్వహించారు. రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికల అనంతరం రైతులకు రూ.500ల బోనస్ ఇస్తామని ప్రకటించి ఇప్పుడు వంకలు పెడుతూ రైతాంగాన్ని మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. రైతులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయకపోతే పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహించి ఆందోళన చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో వనమా రాఘవేంద్రరావు, కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మీ, వైస్‌చైర్మన్ దామోదర్ యాదవ్, ఎంపీపీలు బాదావత్ శాంతి, భూక్యా సోనా, మండల పార్టీ అధ్యక్షులు కొట్టి వెంకటేశ్వర్లు, ఉర్దూగర్ కమిటీ చైర్మన్ అన్వర్‌పాషా, ప్రధాన కార్యదర్శి బొమ్మిడి శ్రీకాంత్, కౌన్సిలర్‌లు, కోఆప్షన్ సభ్యులు, ఎంపిటీసీలు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఉపసర్పంచ్‌లు, పట్టణ, మండల కమిటీ సభ్యులు, అనుబంధ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



కొత్తగూడెంలో బీఆర్ఎస్ శ్రేణుల నిరసన

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

మణుగూరుటౌన్, మే 16: సింగరేణి సంస్థలో పనిచేస్తోన్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు సంబంధించిన దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంతోటి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం సంఘం ఆధ్వర్యంలో ఏరియా డీజీఎం పర్సనల్ ఎస్.రమేష్‌ను సంఘం ఆధ్వర్యంలో కలిసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏరియాలో పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, చేంజ్ ఆఫ్ క్వార్టర్స్ సమస్యలతోపాటు ఇతర సమస్యలను పరిష్కరించడంలో ఏరియా యాజమానయం సానుకూలంగా స్పందించాలని కోరారు. ఈ మేరకు ఏరియా జీఎం దుర్గం రాంచందర్, డీజీఎం పర్సనల్ రమేష్‌లు తమ విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారన్నారు. కార్యక్రమంలో పొన్నగంటి అంకుష్, జమ్మిడి మల్లేష్, శనిగరపు కుమారస్వామి, కాజీపేట కృష్ణ, నాగరాజు, ప్రమోద్, శ్రీనివాస్, సారధిబాబు, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని దానాల్లోకెల్లా అన్నదానం మిన్న: కొత్వాల


అన్నదానంలో పాల్గొన్న కొత్వాల

పాల్వంచ టౌన్, మే 15: అన్నిదానాల్లో కెల్లా అన్నదానం మిన్న అని డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. గురువారం పాత పాల్వంచ సాయినగర్‌లోని షిరిడి సాయిబాబా భజనమందిరంలో విగ్రహ ప్రతిష్ఠ జరిగి పది సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఘనంగా 11వ వార్షిక మహోత్సవం నిర్వహించారు. దేవాలయం పూజారులు చిలుకూరు దినకరశాస్త్రి, లక్ష్మినారాయణల ఆధ్వర్యంలో పలు అభిషేకాలతోపాటు అన్నాభిషేకం వంటి పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజల్లో కొత్వాల సతీమణి విమలాదేవి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సుమారు 700మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మున్నూరుకాపులకు ప్రాధాన్యమివ్వాలి

భద్రాచలం, మే 16: మున్నూరు కాపులకు స్థానిక ఎన్నికల్లో అన్ని పార్టీలు ప్రాధాన్యమివ్వాలని మునూనరు కాపు సంఘం అధ్యక్షులు కొండ దేవయ్య కోరారు. గురువారం భద్రాచలంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో మున్నూరు కాపులకు దామాషా ప్రకారం టికెట్లు పొందడం కోసం కుల సోదరుల్లో చైతన్యం కలిగించే విధంగా చేపట్టిన చైతన్య యాత్ర భద్రాచలంలో ప్రారంభించడం జరిగిందన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం మున్నూరు కాపు కార్పోరేషన్ ఏర్పాటు చేసిందన్నారు. నిధులను సైతం కేటాయించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో వల్లాల ప్రసాదరావు, ప్రకాషరావు, వాసాల వెంకటేశ్వరరావు, ఆది కోటేశ్వరరావు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన

జూలూరుపాడు, మే 16: రోజురోజుకి పెరిగిపోతున్న సైబర్‌నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెడ్‌కానిస్టేబుల్ దయానంద్ అన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గురువారం జూలూరుపాడులో సైబర్ నేరాలు, 100కాల్ వినియోగం, ట్రాఫిక్ నిబంధనలు తదితరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్లు కొత్తకొత్త యాప్‌లు వస్తున్నాయని, వాటిని సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవద్దని, ఆధార్, బ్యాంకుఖాతా, ఓటీపీల వివరాలను ఎవరికి చెప్పవద్దని తెలిపారు. ఏమైన ఇబ్బందులు తలెత్తినట్లైతే వెంటనే 100కు కాల్ చేయాలని కోరారు. మద్యం సేవించి వాహనాలను నడపవద్దని, ద్విచక్రవాహనదారులు తప్పని సరిగా హెల్మెట్లు ధరించాలన్నారు. వాహనదారులందరు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది వెంకట్, కోటి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన ఇసుకవాగు బ్రిడ్జి నిర్మాణ పనులు

అశ్వాపురం, మే 16: కాంట్రాక్టర్ నిర్లక్ష్యం,అధికారుల ఉదాసీన వైఖరి కారణంగా దశాబ్దాలుగా గిరిజనులు ఎదురుచూస్తున్న మండల పరిధిలోని గొందిగూడెం ఇసుక వాగు నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. దీంతో ఈ ఏడాది వర్షాకాలం నాటికైనా తమ కష్టాలు తీరేటట్లు లేవని గిరిజనులు వాపోతున్నారు. మండలంలో మారుమూల గొందిగూడెం ఇసుక వాగుపై బ్రిడ్జి లేక పోవటంతో దశాబ్దాలుగా సుమారు 20గ్రామాల గిరిజనులు వర్షాకాలంలో బాహ్య ప్రపంచానికి దూరంగా ఉండే పరిస్థితి. ఈనేపథ్యంలో గత ఏడాది మేనెలలో గొందిగూడెం ఇసుక వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం రూ7కోట్లు మంజూరు చేయటంతో టెండర్ ద్వారా కాంట్రాక్టర్ పనులు ప్రారంభించాడు. అయితే మొదట్లో అధికారుల పర్యవేక్షణ కొరవడటం, ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికల పక్రియ ప్రారంభం కావటంతో పనులు అరకొరగా కొనసాగాయి. ఏడాది దాటుతున్నా నేటికీ సగం పనులు కూడా పూర్తికాక పోవటం, వర్షాకాలం సమీపిస్తుండటంతో గడువులోగా పనులు పూర్తయ్యే అవకాశం కనబడటంలేదు. ఇసుకవాగు కారణంగా ఉమ్మడి గొందిగూడెం పంచాయతీ పరిధిలోని ఇరవై గ్రామాల గిరిజనులు వాగు ఉధృతికి రాకపోకలు నిలిచిపోయి బాహ్యప్రపంచానికి దూరమై మౌళిక సదుపాయాలు అందక అవస్థలు పడాల్సిన పరిస్థితి ఉంది.


నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి

యార్లగడ్డ స్మారక స్థూపం ప్రారంభం

హాజరైన ఎమ్మెల్యే కూనంనేని

అశ్వారావుపేట, మే 16: దివంగత దమ్మపేట సీపీఐ మండల కార్యదర్శి యార్లగడ్డ భాస్కరరావు స్మారక స్థూపం, విగ్రహాలను గురువారం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రారంభించారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. భాస్కరరావు దశదిన కార్యక్రమాలకు హాజరైన కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర నాయకులు బాగం హేమంత్‌రావులు మాట్లాడుతూ భాస్కరరావు అనారోగ్యంతో మృతి చెందటం విచారకరమని, ఆయనలేని లోటు పార్టీకి తీరనదని, ఆయన కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, నర్రాటి ప్రసాద్, సీపీఎం నాయకులు కె.పుల్లయ్య, టీడీపీ నాయకులు వలీ పాషా తదితరులు పాల్గొన్నారు.